RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 68 Issue No. 68 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శనివారం 07-03-2026 Saturday, March 07 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## ఏపీలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ప్రోత్సహిస్తాం

మంత్రి నారా లోకేశ్



**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల వివరాలు, ఈఎంసీలో పరిశ్రమలకు ఇప్పటికే కేటాయించిన భూ విస్తీర్ణం, ఖాళీగా మిగతా 2లో..

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

- వైసిపి వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం
- ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్
- పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- వైసిపి విద్యుత్ కొనుగోళ్ళతో రూ.12,250కోట్ల నష్టం
- విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం
- రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం
- రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ మిగతా 2లో..



# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు

**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే మిగతా 2లో..

# సివిల్స్ ఫలితాలు విడుదల

సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు... అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్




**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబర్లు.. 23385271, 23381125, 23098543 సంప్రదించాలని మిగతా 2లో..

# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన




**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మిగతా 2లో..

# టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ

బాధ్యతలు స్వీకరించిన రవిచంద్ర



**తిరుమల, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ రవిచంద్ర తిరుమల వేంకటేశ్వరుడి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 మిగతా 2లో..

# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

ఇద్దరు పైలట్లు దుర్మరణం.... ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్



**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను మిగతా 2లో..

# మరోమారు బొత్సకు అస్వస్థత

- బిపి హెచ్చు తగ్గులతో అలసట
- వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు



**అమరావతి, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మరోమారు అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ ఇబ్బందిపడటంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన మిగతా 2లో..

# 'చనిపోయిన' ఓటర్లను మీ ముందు నిలబెడతా

ఈసీపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత ఫైర్



**న్యూఢిల్లీ, మార్చి 6 (ఆర్ఎన్ఎ):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో ధర్నా చేపట్టారు. భాజపా, ఎన్నికల సంఘం కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ ఈ సమగ్ర సవరణ అని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీని ఓడించాలనే కుట్రతోనే బెంగాల్లో హడావిడిగా సర్ ప్రక్రియ చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బతికి ఉన్న అనేక మంది ఓటర్లను సవరించిన ఓటర్ల జాబితాలో చనిపోయినట్లుగా తప్పుడుగా ప్రకటించారని మమత అన్నారు. చనిపోయినట్లు ఈసీ ప్రకటించిన వారిని తీసుకు వచ్చి ఎన్నికల కమిషన్ అధికారుల ముందు నిలబెడతానన్నారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి భాజపా ఎన్నికల కమిషన్‌ను పావులా వాడుకుంటోందని మమత ఆరోపించారు. వారి కుట్రను త్వరలోనే బయటపెడతానన్నారు. ఎన్నికలకు ముందు ఇటువంటి కుట్రలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 54 లక్షల మంది అర్హులైనవారి పేర్లను ఈసీ ఓటర్ల జాబితా నుంచి తొలగించిందని..దీనివల్ల అనేక మంది మైనారిటీ ఓటర్లు, వలస కార్మికులు నష్టపోయారన్నారు. ఏకపక్షంగా ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయని, తమ స్థానికతను నిరూపించుకోవడానికి బెంగాల్ ప్రజలకు ఒక్క అవకాశమూ ఇవ్వలేదని విమర్శించారు.

మొదటి పేజీ తరువాయిలు

## సివిల్స్ ఫలితాలు విడుదల

ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది. గతేడాది అంటే.. 2025లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తో పాటు గ్రూప్ ఎ, గ్రూప్ బిలో వివిధ సెంట్రల్ సర్వీస్‌లో వీరంతా చేరనున్నారు.

## పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా– ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ

గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. తిరుమల యాత్రికులకు సాటి యాత్రికుడిగా సేవ చేస్తానని చెప్పారు. యాత్రికుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో ప్రజలకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

## అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

తాను త్యాగం చేసుకున్నాడు. పూర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నంతగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కర్ ఈ తోయిబాలో భాగమైన రెసిస్టెన్స్ ఫ్రంట్ ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది. దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తరువాత పాకిస్థాన్.. భారత్‌పై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులకు తెగబడగా.. భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్‌ను షేక్ చేశాయి. మే 10వ తేదీన ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించారు. దాంతో ఆపరేషన్ సిందూర్ నిలిచిపోయింది.

## ఏపీలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను ప్రోత్సహిస్తాం

ఉన్న భూ విస్తీర్ణంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో మూడు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఉన్నాయన్నారు. ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉంది కాబట్టే... ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని, ఎలక్ట్రానిక్ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేయాలని కేంద్రం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందులో భాగంగా విశాఖలో ఏసిప్ (ూూూ)అనే సంస్థకు భూములు కేటాయించినట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని, చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉంటే.. యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

## మరోమారు బొత్సకు అస్వస్థత

ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. అయితే మూడ్రోజుల విశ్రాంతి అనంతరం శుక్రవారమే బొత్స తిరిగి సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రి లోకేశ్ ఆత్మీయంగా పలకరించారు. 'బొత్స సత్యనారాయణ గారు నమస్కారం' అంటూ పలకరించారు. బొత్స సత్యనారాయణ వినకపోవడంతో వెంటనే కల్పించుకున్న చైర్మన్.. 'మంత్రి నారా లోకేశ్ మిమ్మల్ని పరామర్శిస్తున్నారు' అంటూ బొత్సకు తెలియజేశారు. వెంటనే మంత్రి మాట్లాడుతూ.. 'గురువుగారు చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన తిరిగి ఆరోగ్యంగా హౌస్‌కు రావడం ఆనందంగా ఉంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

(మొదటి పేజీ తరువాయి)

బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13–16 ఏళ్ల లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నిస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా దేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6–7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు కొనసాగిస్తున్నామని, వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు.

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించారు. బడ్జెట్ లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్లు ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బడ్జెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కూటమి చాలా బలంగా ఉండాలనేది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏపీ అభివృద్ధి కోసమే 2014లో అలయన్స్ కోసం కష్టపడ్డానని తెలిపారు. 2019లో అది సాధ్యం కాలేదని.. 2024లో మరోసారి వెనక్కు తగ్గి పొత్తు పెట్టుకున్నానని ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలంటే మనలో ఏదైనా చిన్నచిన్న సమస్యలున్నా సర్దుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగంలోని మూడు వ్యవస్థలు పరస్పర సహకారంతో పని చేయాలని తెలిపారు. ఏ వ్యవస్థలో లోపాలు ఏర్పడినా ప్రజలకు సేవ చేయటంలో ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. జగన్ అండ్ కో కుట్రలను ఎదుర్కోవాలంటే మనం కలిసి ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను పారదర్శకంగా ఖర్చు చేశామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా వారు అడిగింది ఇవ్వటానికి తాను ప్రయత్నించానని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా తన శాఖల తరపున ఇచ్చిన నిధుల వివరాలు అందజేస్తున్నానని తెలిపారు. బడ్జెట్ వస్తుందంటే ప్రతి ఒక్కరూ ఎన్నో ఆశలుపెట్టుకుంటారని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 15సంవత్సరాలు ఏపీ కోసం కూటమి పని చేస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి బలంగా ఉండాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని అన్నారు. మంత్రులు కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ తమ శాఖల్లో బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పర్యాటక రంగంలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ధాన్యం రైతులకు 24గంటల్లో డబ్బులు జతచేశామని వెల్లడించారు. మూడువేల గ్రామాల్లో తాగునీటి సమస్య గుర్తించామని... అక్కడ తొలి ప్రాధాన్యంగా నీరు ఇస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఏపీవ్యాప్తంగా 48వేల జనావాసాల్లో సురక్షిత తాగునీరు ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2019 నుంచి 2024 మధ్య ఉపాధి హామీ పథకంలో రూ.610కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3,853కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఐదేళ్లలో 880 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేస్తే మనం 6వేల కిలోమీటర్లు వేశామని వెల్లడించారు. వైసీపీ హయాంలో అన్ని రోడ్లు 8,500కిలోమీటర్లు వేస్తే... మనం రెండేళ్లలో 17,500 కిలోమీటర్ల రోడ్లు వేశామని తెలిపారు. చిట్టచివర్లో ఉన్న ప్రజానీకానికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలనే లక్ష్యంతో తాము పనిచేశామని పేర్కొన్నారు. ఇన్ని కష్టాలు, నష్టాలున్నా 11.75 ఆర్థిక వృద్ధిరేటు చూపించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు. కోటి 11లక్షల సివిల్ కేసులు, 3కోట్లకు పైగా క్రిమినల్ కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని గవర్నర్ సూచించారన్నారు. మన వద్ద ఉన్న కోర్టుల సంఖ్య, సిబ్బంది సంఖ్య ప్రకారం ఈ కేసులు ఎప్పటికీ పరిష్కారమవుతాయో చెప్పలేమని అన్నారు. చాలా కోర్టుల్లో కనీస సౌకర్యాలు లేవని.. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేవని... న్యాయశాఖకు సరిపడా నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో 100 కోర్టు గదులకు నిధులు కేటాయించటం సంతోషమని చెప్పుకొచ్చారు. ఎవరిపైన కేసు నమోదైనా అది వ్యక్తిగతం కాదని.. వారి కుటుంబం పైనా ప్రభావం చూపిస్తుందని తెలిపారు. వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని గవర్నర్ సూచించారని అన్నారు. కోర్టుల్లో మౌలిక సౌకర్యాలు, సాంకేతిక వ్యవస్థ ఏర్పాటు చేయటం అత్యవసరమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## టీమిండియా అద్భుత ప్రదర్శన... ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ అభినందనలు

**విజయవాడ, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్లో గెలుపొంది తుది పోరుకు అర్హత సాధించిన భారత జట్టుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఇంగ్లండ్‌పై టీమ్‌ఇండియా అద్భుత విజయం సాధించిందని 'ఎక్స్' వేదికగా కొనియాడారు. న్యూజిలాండ్‌తో ఈ నెల 8న జరిగే ÷నైల్ మ్యాచ్‌లో కూడా ఇదే జోరు కొనసాగించి మరోసారి ప్రపంచ కప్‌ను ముద్దాడాలని ఆయన ఆకాంక్షించారు. 'ఎంతో అద్భుతమైన మ్యాచ్! ఇంగ్లండ్‌పై అద్భుతమైన విజయం సాధించి ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ ÷నైల్‌కు చేరిన టీమ్‌ఇండియాకు అభినందనలు. సంజూ శామ్సన్, శివమ్ దూబెల మెరుపు ఇన్నింగ్స్, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాల చక్కటి బౌలింగ్, అక్షర్ పటేల్ చురుకైన ఫీల్డింగ్‌తో మంచి ప్రదర్శన చేశారు. ఉత్కంఠ పోరులో సమష్టి పోరాటంతో భారత జట్టు గొప్ప విజయం సాధించి తుదిపోరుకు చేరింది. ఫైనల్లోనూ ఇదే ఆటతీరును ప్రదర్శించాలని కోరుతున్నా' అని చంద్రబాబు అన్నారు. టీమ్‌ఇండియా సమష్టి ప్రదర్శనను మెచ్చి ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కూడా అభినందనలు తెలిపారు. 'సెమీస్‌లో భారత్ అద్భుత ప్రదర్శన కనబర్చింది. సంజూ శామ్సన్, శివం దూబె చక్కటి ఆటతీరుతో టీ20 ప్రపంచకప్ సెమ్ఫీ÷నైల్లో ఇంగ్లండ్‌పై చిరస్మరణీయ విజయం సాధించాం. ఈ ఆధిపత్య ప్రదర్శనకు జట్టులోని సభ్యులందరికీ అభినందనలు. దేశం మిమ్మల్ని ప్రోత్సహిస్తోంది. ÷నైల్లోనూ మరింత మెరుగైన ప్రదర్శనతో దేశానికి కప్ తీసుకురావాలి' అని లోకేశ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కాగా.. ఇంగ్లండ్‌పై గెలిచిన టీమ్‌ఇండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. టీ20 క్రికెట్లో ఇప్పటివరకూ ఏ జట్టుకూ సాధ్యం కాని ఘనతను సొంతం చేసుకుంది భారత్. పురుషుల పొట్టి ప్రపంచకప్ ఫార్మాట్లో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. పొట్టి క్రికెట్లో అత్యధిక సార్లు 250 ప్లస్ స్కోరు సాధించిన జట్టుగా నిలిచింది. తద్వారా ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ పేరిట ఉన్న రికార్డును బద్దలుకొట్టింది. కాగా.. సూపర్–8లో జింబాబ్వేపై 256 పరుగులు సాధించిన భారత జట్టు.. సెమీస్‌లోనూ 250కి పైగా స్కోరు నమోదు చేసింది. ఈ విజయంతో భారత అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రపంచ క్రికెట్‌లో భారత్ తన బలాన్ని మరోసారి నిరూపించిందని క్రీడాభిమానులు అంటున్నారు.

## విజయవాడ ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

### 9న జరిగే మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**విజయవాడ, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా– 2026 ను ఈనెల 9వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు విజయవాడ ప్రభుత్వ ఐటిఐ నందు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా – 2026 లో వివిధ కంపెనీలు హాజరై అర్హులైన ఐటిఐ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని అయన తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు గత ఏడాది (2025) తుది సంవత్సరం పరీక్షలు వ్రాసిన విద్యార్థులందరూ అప్రెంటిస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అయన గుర్తు చేశారు. 0వ తరగతి, ఐటిఐ మార్కుల మెమోలు, ఎస్ టి సి సర్టిఫికెట్ లు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, కుల ధ్రువీకరణ పత్రం మొత్తం మూడు సెట్లు జిరాక్స్ కాపీలు ఒరిజినల్ లతో కూడి అభ్యర్థులు మేళాకు తీసుకురావాలని తెలిపారు. ÷ూవున ఐటిఐ పాస్ అయి అప్రెంటిస్ పూర్తి కాని అభ్యర్థులు (అన్ని ట్రేడ్ ల వారు) ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళ – 2026 కు మార్చి 9వ తేదీ ఉదయం 9 గంటలకు గవర్నమెంట్ ఐటిఐ విజయవాడ కేంద్రం లో అన్ని ఒరిజినల్స్ మరియు జిరాక్స్ సెర్టిఫికెట్ లతో హాజరై అర్హత మేరకు ఉద్యోగ అవకాశాలు పొందాలని ప్రిన్సిపల్ కనకారావు తమ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో ప్రైవేట్ బస్సు బోల్తా

### ఐదుగురు ప్రయాణికుల మృతి

**రాయ్‌పూర్,మార్చి6(ఆర్ఎన్ఎ):** ఛత్తీస్‌గఢ్ లోని జాష్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మరికొన్ని గంటల్లో తమ గమ్య స్థానం చేరుకుంటామనే లోపు మృత్యు ఒడిలోకి చేరుకున్నారు. ఒక ప్రైవేట్ బస్సు బోల్తా పడటంతో ఐదుగురు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రులకు తరలించారు. తప్కరా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోడాంబ గ్రామ సమీపంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.


దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి: @SCRRailwayIndia
దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటీసుల వివరాలు మా వెబ్‌సైట్‌లో చూడవచ్చు: www.scr.indianrailways.gov.in

ఈ-టెండర్ నోటీసు నం.: GNT/SG/36/ 369, 370, 371 తేదీ: 27-02-2026 PUB/2053

క్రింద సంతకం చేసిన అధికారి, క్రింద పేర్కొన్న పనుల కొరకు 23-03-2026 తేదీ సాయంత్రం 16:00 గంటల వరకు ఈ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

ఐడి నం. 369 – పనికి పేరు గుంటూరు డివిజన్‌లో పాతబడిన టెలికాం ఎక్స్ఛేంజ్‌లను మార్చడం.
ప్రకటించిన టెండర్ విలువ: రూ. 3,74,20,700.00
ఈ.ఎం.డి / బిడ్ సెక్యూరిటీ: రూ. 3,37,100/-
టెండర్ డాక్యుమెంట్ ధర: లేదు

ఐడి నం. 370 – పనికి పేరు గుంటూరు డివిజన్‌లో ఎక్స్ఛేంజ్‌ల కమిషనింగ్‌కు సంబంధించి టెలికాం ఏర్పాట్లు చేయడం.
ప్రకటించిన టెండర్ విలువ: రూ. 1,35,93,546.60
ఈ.ఎం.డి / బిడ్ సెక్యూరిటీ: రూ. 2,18,000/-
టెండర్ డాక్యుమెంట్ ధర: లేదు

ఐడి నం. 371 – పనికి పేరు జీఎన్టీ డివిజన్‌లోని 71 ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ మరియు ప్యానెల్ ఇంటర్ లాకింగ్ స్టేషన్లు / గూమ్టీలలో ఆస్పిరేషన్ టైప్ స్మోక్ డిటెక్షన్ సిస్టమ్ ఏర్పాటు చేయడం.
ప్రకటించిన టెండర్ విలువ: రూ. 6,80,77,319.24
ఈ.ఎం.డి / బిడ్ సెక్యూరిటీ: రూ. 4,90,400/-
టెండర్ డాక్యుమెంట్ ధర: లేదు

1. టెండర్లు తెరవబడే తేదీ తరువాత ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించబడినట్లయితే, టెండర్లు తదుపరి పని దినంలో అదే నిర్దేశిత సమయంలో తెరవబడతాయి. 2. ఈ-బిడ్స్ ఆన్‌లైన్ సమర్పణకు చివరి తేదీ: 23-03-2026 సాయంత్రం 16:00 గంటల వరకు. వివరమైన సమాచారం కోసం: www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.
3. తదుపరి సమాచారము / సవరణలు (Corrigendum) ఏవైనా ఉంటే అవి కేవలం ఈ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయబడతాయి.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, గుంటూరు.

టెండర్ నోటీసు PUB/2056

చెల్లుబాటు అయ్యే 'A' గ్రేడ్ 11KV లేదా అంతకంటే ఎక్కువ విద్యుత్ కాంట్రాక్టర్ లైసెన్స్ కలిగి ఉన్న కాంట్రాక్టర్ల నుండి E-టెండర్లను ఆహ్వానించారు. భారత రాష్ట్రపతి తరపున, ఎలక్ట్రికల్ బ్రాంచ్ ఆఫ్ ది చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే, వ్యాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి -521 241 ఈ క్రింది పనుల కోసం 30.03.2026న 14-45 గంటల వరకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం. GR/E.29/1/212, తేదీ:02.03.2026 వివ--రణ WWS/GTPL వద్ద ప్రొటెక్టివ్ రిలే మెకానిజంతో వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్లతో విద్యుత్ ఆస్తులను అంటే HT 4 పోల్ నిర్మాణాలను భర్తీ చేయడం. పరిమాణం 01 పూర్తి చేసిన కాలం 6 నెలలు టెండర్ విలువ రూ. 70,63,768.34 (రూపాయలు డెబ్బై లక్షల అరవై మూడు వేల ఏడు వందల అరవై ఎనిమిది పాయింట్ మూడు నాలుగు పైసలు మాత్రమే). బిడ్ సెక్యూరిటీ/ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చేయాలి రూ. 1,41,300/- (రూపాయలు ఒక లక్ష నలభై ఒక వేల మూడు వందలు మాత్రమే). టెండర్ డాక్యుమెంట్ ధర ఉచిత ఆఫర్ చెల్లుబాటు ప్రారంభ తేదీ నుండి 60 రోజులు. టెండర్ పనుల రకం IRGCC-2022 ద్వారా నిర్వహించబడే టెండర్. టెండర్ వ్యవస్థ ఓపెన్ టెండర్ సింగిల్ ప్యాకెట్. పని యొక్క సారూప్య స్వభావం వర్తిస్తుంది. బిడ్ ముగింపు సమయం & తేదీ తేదీ 15-00 గంటలు తేదీ. 30.03.2026, బిడ్ ప్రారంభ సమయం & తేదీ 15-15 గంటలు DI. 30.03.2026. టెండర్ డాక్యుమెంట్ మరియు కొరిజెండమ్. టెండర్ డాక్యుమెంట్ మరియు మార్పులు /కొరిజెండ కోసం http://www.lreps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

టెండర్లు తెరవబడే తేదీ ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించబడితే, టెండర్లు తదుపరి పని దినంలో అదే సమయానికి తెరవబడతాయి.

డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, వాగన్ వర్క్‌షాప్ / గుంటుపల్లి.

టెండర్ నోటీసు నం.: CRS-E-13-25-26 PUB/2054

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి పక్షాన వ్యవహరిస్తూ, (DY.CME/CRS/TPTY) క్రింద పేర్కొన్న టెండర్ నంబర్‌కు సంబంధించి ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. టెండర్లు క్రింద పేర్కొన్న ముగింపు తేదీ రోజున ఉదయం 11:00 గంటల వరకు స్వీకరించబడతాయి. బిడ్డర్లు తమ అసలు / సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు; అటువంటి ఆఫర్లు అందిన పక్షంలో అవి పరిగణనలోకి తీసుకోబడవు.

క్రమ సంఖ్య: 1 – పనికి వివరణ టెండర్ నం.: CRS-E-13-25-26 పని పేరు: తిరుపతి క్యారేజ్ రిపేర్ షాప్ వర్క్‌షాప్‌లోని వివిధ ప్రదేశాలలో ఉన్న ఎల్.టి ప్యానెల్స్ (MPCC & SPCC) మార్పిడి చేయడం.
సుమారు వ్యయం: రూ. 1,39,36,083.48
బిడ్ సెక్యూరిటీ: రూ. 2,19,700/-
పని పూర్తి చేసే కాలం: 90 రోజులు ముగింపు తేదీ: 23-03-2026 ఉదయం 11:00 గంటలకు.

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in

టెండర్ పూర్తి వివరాలు చూడగల నోటీస్ బోర్డు స్థలం: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి. టెండర్ నిబంధనలు/పూర్తి వివరాలు (టెండర్ పత్రాలలో లభ్యం) తెలుసుకోవడానికి మరియు టెండర్ డాక్యుమెంట్లు, సవరణలు (Corrigendum) డౌన్‌లోడ్ చేసుకోవడానికి మా వెబ్‌సైట్ https://www.ireps.gov.in ను సందర్శించండి.

డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి

నం.: G/E.29/Tr/Tenders/2025-26 తేదీ: 05-03-2026 PUB/2055

టెండర్ నోటీసు నం.: G/E.29/Tr./ Tender Notice/59/2025-26

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి పక్షాన వ్యవహరిస్తూ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్ క్రింది పనుల కొరకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
టెండర్ నం.: GTL-TRD-29-eTN-91-2025-26
పని పేరు: జీటీఎల్ (GTL) డివిజన్‌లో RU–GY–DMM విభాగంలో ట్రాక్ ఎత్తు పెంపు కారణంగా భద్రతా దృష్ట్యా వంగిన / క్రిటికల్ మరియు తక్కువ కాంటాక్ట్ వైర్ ఎత్తు ఉన్న ఓహెచ్ఈ (OHE) నిర్మాణాలను కొత్త ఓహెచ్ఈ నిర్మాణాలతో మార్పిడి చేయడం.
సుమారు వ్యయం: రూ. 1,66,77,604/-
ఈఎమ్‌డీ (EMD): రూ. 2,33,400/-

టెండర్ ముగింపు తేదీ మరియు సమయం: 26-03-2026 సాయంత్రం 15:00 గంటలకు.

గమనిక: 1.టెండర్ పత్రాలను టెండర్ దారులు www.ireps.gov.in వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. టెండర్‌లో బిడ్ సమర్పించడానికి మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in లో లాగిన్ అవ్వాలి. ఏవైనా సవరణలు (Corrigendum) ఉంటే అవి ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్

ఓపెన్ ఈ-టెండర్ నోటీసు నం.: DRM/ Works/BZA/09/2026, తేదీ: 05-03-2026 PUB/2057

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి పక్షాన వ్యవహరిస్తూ, క్రింద సంతకం చేసిన అధికారి క్రింది పనుల కొరకు ఆయా పనులకు ఎదురుగా పేర్కొన్న తేదీ రోజున మధ్యాహ్నం 15:00 గంటల వరకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య: 1 టెండర్ నం.: E-06-EAST-BZA-2026 పని వివరాలు / పనిపేరు: విజయవాడ డివిజన్ BZA–GDV & GDV–MTM సెక్షన్లు (UP & DN):
(i) TFTR – సెస్సు విస్తరణ / మరమ్మత్తులు, బ్యాంక్ టో సమీపంలోని తక్కువ ఎత్తు ప్రాంతాలను మట్టి నింపి నీరు నిల్వ ఉండకుండా నివారించడం, టో బ్యాంక్ ఏర్పాటు చేయడం, సమీప ట్రాక్‌ల మధ్య దూరం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో (UP లేదా DN లైన్) ఫార్మేషన్ ఎత్తు 3 మీటర్లకు తక్కువ లేదా సమానంగా ఉన్న ప్రాంతాలలో పరిమిత పొడవులో ప్రీకాస్ట్ / కాస్ట్ ఇన్‌సిటు RCC సెంట్రల్ మరియు క్రాస్ డ్రైన్లను ఏర్పాటు చేయడం – మొత్తం పొడవు 2.000 కి.మీ. (ii) TFTR – సెస్సు విస్తరణ / మరమ్మత్తులు, బ్యాంక్ టో సమీపంలోని తక్కువ ఎత్తు ప్రాంతాలను మట్టి నింపి నీరు నిల్వ ఉండకుండా నివారించడం, టో బ్యాంక్ ఏర్పాటు చేయడం, సమీప ట్రాక్‌ల మధ్య దూరం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో (UP లేదా DN లైన్) ఫార్మేషన్ ఎత్తు 3 మీటర్లకు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పరిమిత పొడవులో ప్రీకాస్ట్ / కాస్ట్ ఇన్‌సిటు RCC సెంట్రల్ మరియు క్రాస్ డ్రైన్లను ఏర్పాటు చేయడం – మొత్తం పొడవు 1.00 కి.మీ. (అనుమతించిన ప్రదేశాలు అనెక్సర్‌లో జతచేయబడ్డాయి) పని పూర్తి చేసే కాలం: 12 (పన్నెండు) నెలలు
టెండర్ విలువ: రూ. 1,35,92,326/-
ఈ.ఎం.డి.: రూ. 2,18,000/-
ముగింపు తేదీ: 26-03-2026.

1. పని పూర్తి వివరాలు, సమాన స్వభావం గల పనుల వివరాలు, అర్హత ప్రమాణాలు మొదలైన టెండర్ నిబంధనలు మరియు ఇతర వివరాలు టెండర్ పత్రాలలో అందుబాటులో ఉండి,"www.ireps.gov.in" వెబ్‌సైట్‌లో ప్రచురించబడ్డాయి.
2. సంబంధిత టెండర్‌దారులు టెండర్ ముగింపు తేదీకి ముందు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌ను సందర్శించి, ఏవైనా మార్పులు / సవరణలు (Corrigendum) ఉన్నాయా అని గమనించాలి.
3. ఈ టెండర్ నోటీసు దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్) కార్యాలయం నోటీసు బోర్డులో మరియు విజయవాడ డివిజన్‌లోని ADEN ఉప విభాగ కార్యాలయాలలో కూడా ప్రదర్శించబడింది.
4. రైల్వేకు ఎటువంటి కారణం చెప్పకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు ఉంటుంది. మరిన్ని వివరాల కోసం మా వెబ్‌సైట్"www.ireps.gov.in" ను సందర్శించండి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ
A2605

టెండర్‌కు సంబంధించిన మరిన్ని నిబంధనలు / వివరాలు తెలుసుకోవడానికి మరియు టెండర్ పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవడానికి దయచేసి క్రింది వెబ్‌సైట్లను సందర్శించండి: https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఈ యుద్ధం ముగిసేదెలా?

పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది. ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయత్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

## అమెరికా ఆస్తులపైనే మా దాడులు

### అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు
### ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే

**న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**విజయనగరం,మార్చి6(ఆర్ఎన్ఎ):** 26వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున మరుపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గజపతినగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదమానాపురం గ్రామానికి చెందిన రౌతు ధనుంజయ నాయుడు (23) పెదనాన్న కుమార్తె వివాహం శుక్రవారం విజయనగరంలో జరగనుంది. ఏర్పాట్లను పరిశీలించడానికి ధనుంజయ నాయుడు మరో ముగ్గురు యువకులతో కలిసి యజమానాపురం నుంచి విజయనగరం వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో మరుపల్లి గ్రామం వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధనుంజయనాయుడు అక్కడిక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

### అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు... అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం

**వాషింగ్టన్,మార్చి6(ఆర్ఎన్ఎ):** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని




పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.

## ఎనుమాముల మార్కెట్లో మిర్చి రాసులు

### భారీగా తరలి వచ్చిన బస్తాలు



**వరంగల్,మార్చి6(ఆర్ఎన్ఎ):** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీగా మిర్చి రావడంతో మార్కెట్ ఎరుపెక్కింది. వరుసగా రెండ్రోజుల నుంచి సుమారు 35 నుంచి 40వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అధికం. దీంతో యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శన మిచ్చాయి. మిర్చి ధరలు గత సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మార్కెట్‌లో మంచి నాణ్యత ఉన్న మిర్చికి గరిష్టంగా పలికిన ధరలు ఇలా ఉన్నాయి... తేజ రకం మిర్చి క్వింటాకు రూ.18,800, వండర్‌హాట్ రూ. 35వేలు, యూఎస్.341 రూ.21వేలు, దీపిక రూ. 30వేలు, ఎల్లోమిర్చి రూ.20 వేలు, సింగిల్‌పట్టి రూ.40వేలు, దేశీ మిర్చి రూ.40వేలు, తాలు క్వింటాకు రూ. 12వేలు పలికింది. ఇటీవల చపాట మిర్చి ధరలు బాగా పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకుంటున్నాయి. 2021-22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ.30వేల నుంచి రూ.40వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ.12వేల నుంచి రూ.16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. జియోట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్టంగా ఉన్నాయి. గత నెల మొదటి వారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ.17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

## భారత ప్రభుత్వ పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ అభివృద్ధి కొరకు భారత పశుధన్ యాప్ ప్రారంభం

- ఆధార్ మరియు మొబైల్ నెంబరు నమోదుతో పశు పోషకునిగా ఎన్నో సేవలు పొందవచ్చును.
- పశుసంవర్ధక శాఖ పధకాల లబ్ది త్వరిత గతిన పొందడానికి యాప్ దోహదకారి..
- పశుపోషకులకు పశుసంవర్ధక శాఖా ద్వారా ఎన్నో రాయితీల కల్పన..
- పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు



**విజయవాడ, మార్చి 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పశు సంవర్ధక శాఖ ద్వారా పశువులకు వ్యాధి నివారణ టీకాలు, కృత్రిమ గర్భధారణ సేవలు విస్తృతంగా అందించడం జరుగుతున్నదని పశు సంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పారదర్శక సేవలైన పశుసంపద యొక్క ఖచ్చితమైన వివరాలు వాటికి వివిధ సేవలు అందించేందుకు పశుసంపద దేశంలో గణనీయంగా పెంపుదల చేయుటకు ప్రత్యేక డిజిటల్ వ్యవస్థ భారత్ పసుధన్ యాప్ ప్రవేశ పెట్టడంలోని ప్రధాన ఉద్దేశ్యం అని అయన చెప్పారు. నూతన యాప్ లో పశుపోషకులు ఆధార్ మరియు మొబైల్ నెంబరుతో నమోదు కావాలని కోరారు. పశు సేవకులకు పశు సంవర్ధక శాఖ సిబ్బంది సహాయం ద్వారా వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ డిజిటల్ వ్యవస్థ వలన పశుపోషకులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఎక్కువ వీలు కలుగుతుందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఆధార్ మొబైల్ నెంబరు మరియు ఓటిపి కోసం పశుపోషకులను సంప్రదించునపుడు సరి అయిన సమాచారం అందించాలన్నారు. మొబైల్ నెంబరు మారిన సమయంలో మరియు మనుగడలో లేకపోయినా ఓటిపి రాదన్నారు. అప్పుడు పశుసంవర్ధక సేవలు నమోదు చేయలేమని చెప్పారు. ఈ సందర్భంలో పశుపోషకులు పశుసంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించి తమ సహకారం అందించి సరి అయిన మొబైల్ నెంబరును భారత్ పశుధన్ యాప్ డిజిటల్ వ్యవస్థలో ఆధునికీకరించుకోవాలని కోరారు. ది. 01-04-2026 తేదీ నుండి పశువులకు కృత్రిమ గర్భధారణ అందించే సమయంలో కూడా పశుపోషకులు మొబైల్ నెంబరుకు వన్ టైం పాస్ వర్డ్ పంపబడుతుందన్నారు. అధీకృత మొబైల్ నెంబరు సమాచారాన్ని కృత్రిమ గర్భధారణ నిపుణులకు మాత్రమే తెలియజేసి సేవల సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో నమోదు చేసుకోవాలని కోరారు. కావున రాష్ట్రం లోని పశుపోషకులు అందరూ తప్పనిసరిగా పశుసంవర్ధక శాఖ వారి నూతన డిజిటల్ వ్యవస్థలో ఆధార్ మరియు మొబైల్ నెంబరుతో నమోదు చేసుకుని మరింత మెరుగైన పశుసంవర్ధక సేవలు పొందాలని కోరారు. భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా పశుసంవర్ధక శాఖ పధకాలు కార్యక్రమాల రూపకల్పనకు సహకరించి రాయితి పధకాలు పొందాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు తమ ప్రకటనలో కోరారు.

## ఆప్కాస్‌లో మరణించిన వారి కటుంబ సభ్యులకు ఉద్యోగాలు

### సిఐటియూ ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన

**విశాఖపట్టణం,మార్చి6(ఆర్ఎన్ఎ):** జివిఎంసి ఆప్కాస్ లో పనిచేసి మరణించిన, రిటైర్ అయిన పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. నూకరాజు, ఉరికూటి రాజు డిమాండ్ చేశారు. ఆప్కాస్ లో పనిచేసి, రిటైర్ అయిన, మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,జివిఎంసి పారిశుధ్య విభాగం, నీటిపారుదల, యుజిడి, వెటర్నరీ, పార్కులు వంటి విభాగాలలో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులలో చనిపోయిన, రిటైర్ అయిన వారి స్థానంలో, వారి కుటుంబ సభ్యులను పనిలోకి



తీసుకోవాలన్నారు. వారందరికీ ఆప్కాస్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వరప్రసాద్,జె.ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కార్మికులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

### డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి

**టెహ్రాన్,మార్చి6(ఆర్ఎన్ఎ):** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేధ్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహెన్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఫత్ర, సెజ్జిల్, సుమర్ వంటి



క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉంది.

## అరటి పండు, బొప్పాయి కలిపి తింటున్నారా? అయితే జాగ్రత్త..



కరోనా టైం నుంచి చాలా మంది ఆరోగ్యంపై చాలా శ్రద్ధ వహిస్తున్నారు. దాదాపుగా జంక్ ఫుడ్ ను వీలైనంత వరకు తగ్గించి ఫ్రూట్స్ పై దృష్టి పెడుతున్నారు. వీలైనప్పుడల్లా ఫ్రూట్స్ తింటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరోగ్య నిపుణులు సైతం ఇదే సూచిస్తున్నారు. ఇక ఫ్రూట్స్ దొరకని వారు రెడిమెడ్ ఫ్రూట్ సలాడ్ ను ఎంచుకుంటున్నారు. ఇలాంటి సమయంలోనూ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు హెల్త్ ఎక్స్‌పర్ట్స్. ఫ్రూట్ సలాడ్ లేదా ఫ్రూట్ మిక్స్ తీసుకునే టైంలో అందులో అరటి, బొప్పాయిని మిక్స్ చేసి చాలా మంది సేల్ చేస్తూ ఉంటారు. ఇలాంటివి తినే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. లేదంటే ముప్పు తప్పదు.అరటి పండులో, బొప్పాయిలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి మన శరీరానికి ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ ఈ రెండు పండ్లను కలిపి తినడం వల్ల కొందరిలో ఇబ్బందులు తలెత్తుతాయి. అందరిలో అని చెప్పలేము. అది పూర్తిగా సదరు వ్యక్తి జీర్ణవ్యవస్థపై డిపెండ్ అయి ఉంటుంది. కొందరిలో జీర్ణ శక్తి సరిగ్గా ఉండదు. అలాంటి వారు అరటి, బొప్పాయి పండు కలిపి తింటే వారిలో సమస్యలు తలెత్తే ఛాన్స్ ఉంది. జీర్ణ శక్తి బాగున్న వారికి ఎలాంటి సమస్య ఉండదు. వాస్తవానికి ఆయుర్వేదంలో బొప్పాయి, అరటి పండ్లను విరుద్ధమైన పండ్లుగా భావిస్తారు. ఈ రెండింటిని కలిపి తినకూడదని చెబుతుంటారు. కలిపి తింటే వాంతులు, వికారం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యల వస్తాయని ఆయుర్వేదం చెబుతోంది. బొప్పాయి, అరటి పండు రెండింటినీ కలిపి తినడం వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతాయట. కామెర్లతో బాధపడే వారు బొప్పాయికి దూరంగా ఉండాలి. మరి ఫ్రూట్ సలాడ్, ఫ్రూట్ మిక్స్ తినే సమయంలో ఇలాంటి జాగ్రత్తలు తప్పక పాటించండి. ఫలితంగా హెల్త్ సమస్యలకు దూరంగా ఉండొచ్చు.

# మజ్జిగ చారును ఇలా తయారు చేసి తినండి..

## ఆరోగ్యానికి మేలు చేస్తుంది..!



సాధారణంగా కూరలతో భోజనం చేసిన తరువాత పెరుగుతో కూడా భోజనం చేసే అలవాటు మనలో చాలా మందికి ఉంటుంది. పెరుగుతో భోజనం చేయనిదే చాలా మందికి భోజనం చేసినట్టుగా ఉండదు.

పెరుగును ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మనకు అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. విటమిన్ బి12 తోపాటుగా కాల్షియం, పొటాషియం, మెగ్నిషియం వంటి మినరల్స్ పెరుగులో అధికంగా ఉంటాయి. శరీరానికి మేలు చేసే బ్యాక్టీరియా పెరుగులో అధికంగా ఉంటుంది. జీర్ణ క్రియను మెరుగుపరచడంలోనూ ఈ బ్యాక్టీరియా ఎంతగానో సహాయపడుతుంది. దీని వల్ల అజీర్తి, గ్యాస్ వంటి సమస్యల నుండి బయట పడవచ్చు.

శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడంలో పెరుగు ఎంతగానో సహాయపడుతుంది. పెరుగును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే కాల్షియం దంతాలను, ఎముకలను ధృడంగా చేస్తుంది. బరువును తగ్గించడంలోనూ పెరుగు ఉపయోగపడుతుంది. వేసవి కాలంలో ఎక్కువగా పెరుగుతో మజ్జిగ, లస్సీ వంటి వాటిని చేసి తాగుతూ ఉంటారు. ఇలా తాగడం వల్ల శరీరానికి కావల్సిన శక్తి లభించడంతోపాటు డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. పెరుగుతో లస్సీ, మజ్జిగనే కాకుండా చారును కూడా చేసుకోవచ్చు. భోజనంలో భాగంగా అన్నంతో కలిపి పెరుగుతో చేసిన చారును తీసుకుంటే చాలా రుచిగా ఉంటుంది. ఇప్పుడు పెరుగు చారును (మజ్జిగ చారు) తయారు చేసుకునే విధానాన్ని, తయారీకి కావల్సిన పదార్థాల గురించి తెలుసుకుందాం.

### మజ్జిగ చారు తయారీకి కావల్సిన పదార్థాలు..

పెరుగు – ఒక కప్పు, తరిగిన ఉల్లిపాయ – అర కప్పు, తరిగిన పచ్చి మిర్చి – ఒక టీ స్పూన్, ఉప్పు – రుచికి తగినంత, నీళ్లు – ఒక గ్లాసు.

### తాళింపుకు కావల్సిన పదార్థాలు..

నూనె – ఒక టీ స్పూన్, ఎండు మిర్చి – 2, జీలకర్ర – పావు టీ స్పూన్, ఆవాలు – పావు టీ స్పూన్, కరివేపాకు – ఒక రెబ్బ, ఇంగువ – పావు టీ స్పూన్, తరిగిన కొత్తి మీర – కొద్దిగా, పసుపు – అర టీ స్పూన్.

మజ్జిగ చారు తయారు చేసే విధానం..

ముందుగా ఒక గిన్నెలో పెరుగు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి, ఉప్పు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న పెరుగులో నీళ్లు పోసి మజ్జిగలా చేసుకోవాలి. ఇప్పుడు ఒక చిన్న కడాయిలో నూనె వేసి కాగాక మిగిలిన పదార్థాలు అన్నీ వేసి తాళింపు వేసుకోవాలి. ఈ తాళింపును ముందుగా తయారు చేసి పెట్టుకున్న మజ్జిగ మిశ్రమంలో వేసి బాగా కలుపుకోవాలి

. దీంతో చక్కటి వాసనతో, ఎంతో రుచిగా ఉండే మజ్జిగ చారు తయారవుతుంది. ఈ చారును అన్నంతో కలిపి తీసుకుంటే ఎంతో రుచిగా ఉంటుంది. దీంతోపాటుగా పెరుగులో ఉండే పోషకాలన్నీ శరీరానికి లభిస్తాయి. చర్మ సౌందర్యాన్ని మెరుగుపరచడంలోనూ పెరుగు ఉపయోగపడుతుంది. చుండ్రును నివారిస్తుంది. పెరుగును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారు.




## మెడ నల్లగా మారుతుందా... ఈ ఇంటి వైద్యాన్ని వాడి చూడండి

సాధారణంగా కొందరి ముఖం ఎంతో తెల్లగా, మృదువుగా, అందంగా మెరిసిపోతుంటుంది. కానీ, మెడ మాత్రం నల్లగా, కాంతిహీనంగా కనిపిస్తుంది. మురికి, మృత కణాలు పేరుకుపోవడం, శరీరంలో అధిక వేడి , పలు రకాల ముందుల వాడకం, ఆహారపు అలవాట్లు, ఎండల ప్రభావం, కాలుష్యం వంటి రకరకాల కారణాల వల్ల మెడ నల్లగా మారుతుంది.

దాంతో మెడ నలుపును వదిలించుకోవడం కోసం నానా పాట్లు పడుతుంటారు. మార్కెట్‌లో లభ్యమయ్యే వివిధ క్రీములను కొనుగోలు చేసి యూజ్ చేస్తుంటారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకుంటే ఏం చేయాలో తెలియక మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. అయితే ఇప్పుడు చెప్పబోయే ఎఫెక్టివ్ రెమెడీని ట్రై చేస్తే మూడు రోజుల్లోనే మెడ నలుపు తగ్గడాన్ని మీరు గమనిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ఆ రెమెడీ ఏంటో ఎలా ప్రిపేర్ చేసుకోవాలో. తెలుసుకుందాం పదండీ ముందుగా మిక్సీ జార్ తీసుకుని అందులో మూడు టేబుల్ స్పూన్ల సగ్గు బియ్యం వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఆ తర్వాత ఒక బౌల్ తీసుకుని అందులో రెండు టేబుల్ స్పూన్ల సగ్గు బియ్యం పొడి, వన్ టేబుల్ స్పూన్ చందనం పొడి, వన్ టేబుల్ స్పూన్ షుగర్ పౌడర్, వన్ టేబుల్ స్పూన్ పెరుగు, మూడు టేబుల్ స్పూన్ల టమాటో జ్యూస్, హాఫ్ టేబుల్ స్పూన్ కొబ్బరి నూనె వేసి అన్ని కలిసేలా బాగా మిక్స్ చేసుకోవాలి.

ఇప్పుడు ఈ మిశ్రమాన్ని మెడకు పట్టించి.రెండు నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆపై వేళ్లతో మెల్ల మెల్లగా స్క్రబ్ చేసుకుని వాటర్‌తో క్లీన్ చేసుకోవాలి. అనంతరం ఏదైనా మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. ఇలా వరసగా మూడు రోజులు చేస్తే రిజల్ట్ చూసి మీరే ఆశ్చర్యపోతారు.

## ఘనంగా భట్టి తనయుడి వివాహం

**సిఎం రేవంత్ తదితర ప్రముఖుల హాజరు**



**హైదరాబాద్,మార్చి6(ఆర్‌ఎన్‌ఎ):** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం వైభవంగా జరిగింది. శంషాబాద్‌లో జరిగిన వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారిని అభినందించారు. గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, నటుడు చిరంజీవి తదితర ప్రముఖులు కూడా వివాహ వేడుకకు హాజరయ్యారు. పలువురు మంత్రులు, మాజీమంత్రులు కూడా హాజరయ్యారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బంధుమిత్రుల సమక్షంలో భారీ జనసందోహం మధ్య వీరి వివాహం ఘనంగా జరిగింది.

### 8నుంచి విమెన్ హాకీ కప్ టోర్నమెంట్... అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వెల్లడి

**హైదరాబాద్,మార్చి6(ఆర్‌ఎన్‌ఎ):** ఈ నెల 8 నుండి గచ్చిబౌలి హాకీ స్టేడియం లో నిర్వహిస్తున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ –2026 క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖా మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ కె శివ సేనా రెడ్డి, సోని బాల మాయాదేవి, ఇతర క్రీడాధికారులు పాల్గొన్నారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. హాకి లో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాల్గి÷ వుమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసాము.మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే,వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లు ఇప్పటికే హైదరాబాద్ చేరుకుని, గచ్చిబౌలి లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాయి. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాల్గి÷యైర్స్ 2026 కి ఈ పోటీలు కీలకంగామారనున్నాయి. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను సమకూర్చింది. క్రీడాకారుడు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి నందు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్ మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి.

## జనాభా లెక్కలు-2027 కోసం డిజిటల్ సాధనాలు

- ఆవిష్కరించిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా
- రెండు దశల్లో జనగణన-2027, ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా లెక్కల కార్యక్రమం
- మొదటిసారి డిజిటల్ విధానంలో జనాభా లెక్కలు: స్వీయ గణనకు తొలిసారి అవకాశం
- సురక్షితమైన వెబ్ ఆధారిత ప్రక్రియే స్వీయగణన: ఇంటింటి సర్వే చేపట్టడానికి ముందే 16 భాషల్లో ఆన్లైన్లో సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చు
- దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణన-2027లో పాల్గొనబోతున్న 3 మిలియన్ల ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు

**న్యూఢిల్లీ, మార్చి 6:** జనగణన–2027 కోసం నాలుగు డిజిటల్ సాధనాలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా న్యూఢిల్లీలో ప్రారంభించారు. వీటితో పాటుగా ప్రగతి (మహిళ), వికాస్ (పురుష) జనాభా లెక్కల మస్కట్లను కూడా ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా గణన కార్యకలాపాలను సులభతరం చేసేందుకు అధునాతన డిజిటల్ ప్లాట్‌ఫారంలను సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ (సీ–డాక్) రూపొందించింది. కేంద్ర హోం కార్యదర్శి, భారతీయ రిజిస్ట్రార్ జనరల్, భారత జనాభా లెక్కల కమిషనర్‌తో సహ పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2025 జూన్ 16న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా జనగణన–2027ను నిర్వహిం చాలనే తన ఉద్దేశాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతి జనాభా లెక్కల కార్యక్రమమైన జనగణన–2027 రెండు దశల్లో జరుగుతుంది. తొలిసారి జనాభాను డిజిటల్ విధానంలో గణిస్తున్నారు. అలాగే మొదటిసారి సెల్ఫ్–ఎన్యూమరేషన్ అవకాశం అందుబాటులోకి తీసుకువచ్చారు.


### 'ప్రగతి', 'వికాస్' మస్కట్‌లు

జనాభా లెక్కలు–2027లో స్నేహపూర్వకమైన, సుపరిచితమైన ప్రతినిధులుగా 'ప్రగతి' (మహిళా ఎన్యూమరేటర్), 'వికాస్' (పురుష ఎన్యూమరేటర్) మస్కట్‌లను ఆవిష్కరించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చాలనే సంకల్పాన్ని నెరవేర్చడంలో మహిళలు, పురుషుల సమాన భాగస్వామ్యానికి చిహ్నాలుగా ఈ మస్కట్‌లు నిలుస్తాయి. వీటి ద్వారా జనాభా లెక్కలు – 2027కు సంబంధించిన సమాచారం, లక్ష్యాలు, కీలకమైన సందేశాలను దేశవ్యాప్తంగా వివిధ వర్గాల్లో ప్రభావవంతంగా ప్రచారం చేస్తారు.

### నాలుగు డిజిటల్ సాధనాలు

డిజిటల్ సాధనాల ద్వారా భారత దేశంలో నిర్వహిస్తున్న మొదటి జనాభా లెక్కలు ఇవి. నాలుగు డిజిటల్ వేదికలను కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు. అవి:

1. హౌస్ లిస్టింగ్ బ్లాక్ క్రియేటర్ (హెచ్‌ఎల్‌బీసీ) వెబ్ అప్లికేషన్: దేశవ్యాప్తంగా భౌగోళిక కవరేజీని అందించేలా ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి డిజిటల్ హౌస్ లిస్టింగ్ బ్లాకులను రూపొందించడానికి అధికారులకు వీలు కల్పించే వెబ్–మ్యాప్ అప్లికేషన్ ఇది



2. హెచ్‌ఎల్‌వో మొబైల్ అప్లికేషన్: గృహ నమోదు సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేయడానికి సురక్షితమైన ఆఫ్‌లైన్ మొబైల్ అప్లికేషన్ ఇది. సీఎంఎంఎస్ ద్వారా రిజిస్టరైన ఎన్యూమరేటర్లు మాత్రమే ఈ అప్లికేషన్‌ను ఉపయోగించగలుగుతారు. క్షేత్రస్థాయి నుంచి సర్వర్ వరకు సమాచార సరఫరాకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది. అలాగే సంప్రదాయ విధానమైన కాగితపు పనిని తొలగిస్తుంది. గృహ నమోదుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఈ యాప్ ద్వారా సేకరిస్తారు. రిజిస్టర్ మొబైల్ నంబర్లను మాత్రమే ఉపయోగించి దీనిని ఆపరేట్ చేయవచ్చు. 16 ప్రాంతీయ భాషల్లో ఉన్న ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ ప్లాట్‌ఫాంలకు అనువుగా ఇది ఉంటుంది.

3. సెల్ఫ్–ఎన్యూమరేషన్ (ఎస్‌ఈ) పోర్టల్: మొదటిసారి స్వీయగణనను ప్రవేశపెడుతున్నారు. సురక్షితమైన వెబ్ ఆధారిత సౌకర్యమే ఈ ఎస్‌ఈ పోర్టల్ ద్వారా అర్హులైన వారు తమ ఇంటి సమాచారాన్ని క్షేత్ర స్థాయి కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే ఆన్‌లైన్లో సమర్పించడానికి ఇది అనుమతిస్తుంది. వివరాలు విజయవంతంగా సమర్పించిన తర్వాత ప్రత్యేకమైన సెల్ఫ్–ఎన్యూమరేషన్ ఐడీ (ఎస్‌ఈ ఐడీ) జనరేట్ అవుతుంది.ఈ స్వీయ–గణన గుర్తింపు (ఎస్‌ఈ ఐడీ)ను ఎన్యూమరేటర్‌కు ఇవ్వాలి. దీని ఆధారంగా సమాచారాన్ని ఎన్యూమరేటర్ ధ్రువీకరిస్తారు.

4. సెన్సెస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్) పోర్టల్: అన్ని పరిపాలనా స్థాయుల్లో జనాభా లెక్కలకు సంబంధించిన అన్ని కార్యకలాపాల ప్రణాళిక, నిర్వహణ, అమలు, పర్యవేక్షణకు సంబంధించిన రూపొందించిన కేంద్రీకృత, వెబ్–ఆధారిత డిజిటల్ వేదిక. ఇంటిగ్రేటెడ్ డ్యాష్ బోర్డు ద్వారా గణన పురోగతి, క్షేత్రస్థాయి పని తీరు, కార్యాచరణ సంసిద్ధతను సబ్–జిల్లా, జిల్లా, రాష్ట్ర స్థాయుల్లోని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు.

జనాభా లెక్కలు–2027లో ఇంటింటికీ వెళ్లి సురక్షితమైన మొబైల్ అప్లికేషన్లతో డేటా సేకరణ జరుగుతుంది. అలాగే పూర్తి స్థాయి కవరేజీకి హామీ లభిస్తుంది. దీని కోసం దేశవ్యాప్తంగా 30 లక్షల కంటే ఎక్కువ మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, జనాభా లెక్కల అధికారులు పనిచేస్తారు.క్రమబద్ధంగా స్వీకరించిన సాంకేతికత.. ఆవిష్కరణను సమ్మిళిత్వంతో మిళితం చేస్తుంది. అలాగే జనగణన–2027ను కచ్చితమైనదిగా, సురక్షితమైనదిగా, సమగ్రంగా ఉండేలా చేస్తుంది.

**జనాభా లెక్కలు–2027 రెండు దశల్లో జరుగుతుంది:**

మొదటి దశ: హౌస్ లిస్టింగ్, హౌసింగ్ లెక్కలు (హెచ్‌ఎల్‌వో) మొదటి దశలో ఇంటి పరిస్థితులు, ఇంట్లోని సౌకర్యాలకు సంబంధించిన సమాచార సేకరణ జరుగుతుంది. రెండో దశలో దేశంలోని ప్రతి వ్యక్తికి సంబంధించిన జనాభా, సామాజిక, ఆర్థిక వివరాలు నమోదు చేస్తారు. 2026 జనవరి 7న మొదటి దశకు నోటిఫికేషన్ జారీ అయింది. 2026 ఏప్రిల్ 1 నుంచి 2026 సెప్టెంబర్ 30 మధ్య ప్రతి రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ లెక్కలు 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి చేస్తారు. ఇంటింటి సర్వేకు ముందు ఐచ్ఛిక 15 రోజుల స్వీయ–గణన వ్యవధి ఉంటుంది.

**రెండో దశ: జనాభా గణన (పీఈ)**

2027 ఫిబ్రవరి నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభమవుతుంది. కేంద్రపాలిత ప్రాంతమైన లదాఖ్, జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాల్లో 2026 సెప్టెంబర్‌లోనే ఎన్యూమరేషన్ జరుగుతుంది. రెండో దశ జనగణనలో కుల సంబంధిత ప్రశ్నను చేర్చనున్నారు.కేంద్ర పాలిత ప్రాంతమైన లదాఖ్, జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాల్లో తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జనాభా లెక్కల రిఫరెన్స్ తేదీ 2027 మార్చి1 00:00 గంటలుగా ఉంటుంది.

## నందిగామ పాత బస్టాండ్ వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి...



**నందిగామ మార్చి 06 ( నేటి మనదేశం ప్రతినిధి) :** నందిగామ పాత బస్టాండ్ సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేయడం కలకలం రేపింది. నందిగామ నుంచి జగ్గయ్యపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ కిరణ్ కుమార్ విధుల్లో ఉండగా బస్సులోకి ఎక్కిన ఒక వ్యక్తి ఆకస్మికంగా ఆయనపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొందరు ప్రయాణికులు వెంటనే స్పందించి దాడి చేసిన వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. దాడిలో డ్రైవర్ కిరణ్ కుమార్ స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. అనంతరం ఆయన నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. దాడికి కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు. బస్సులో ఉన్న ప్రయాణికుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో ఆర్టీసీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్ల భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## మంత్రి వాసంశెట్టి రాజీనామాకు ఏఐటీయూసీ డిమాండ్




**కాకినాడ మార్చి 06 ( నేటి మనదేశం ప్రతినిధి) :** కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడులో 28 మంది మృతికి బాధ్యత వహిస్తూ కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజీనామా చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. బాధిత కుటుంబాలకు రూ. 50 లక్షల పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నాయకులు కేసీ బాదుల్లా కోరారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని వారు మండిపడ్డారు.

హోమ్ఆంధ్రప్రదేశ్అనంతపురం జిల్లాహిందూపురం

## హిందూపురంలో ఓపెన్ హౌస్ నిర్వహించిన పోలీసులు



**కడప మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, శుక్రవారం హిందూపురం వన్ టౌన్ ఎస్సై శ్రీధర్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, మహిళల భద్రత, పోక్సో చట్టం, వైర్లెస్ సెట్ పనితీరు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



**రాయదుర్గం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనంతపురం జిల్లా రాయదుర్గం లోని ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రూ.4 కోట్లు, కణేకల్లు సబ్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు.. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడ్ని కోరారు. మిర్చి, శనగలు, చింతపండు, కందులు తదితర వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ మార్కెట్ యార్డు ఛైర్మన్ యు. హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

## రైతులు ఉద్యాన పంటలను సాగుచేయాలి



**విజయనగరం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అత్యధిక లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలనే రైతులు సాగు చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భోగాపురం మండలంలో కలెక్టర్ పర్యటించారు. కొయ్యపేటలో రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. పొలాల్లో దిగి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగు చేస్తున్న పద్ధతులు, మార్కెట్ సదుపాయం తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి స్థానంలో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, పూల సాగు ద్వారా నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ఉద్యాన సాగు వైపు మళ్లే రైతులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా వారు పండించిన పంటలకు మార్కెట్ సదుపాయంతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తామన్నారు. అత్యధిక దిగుబడి కోసం సంప్రదాయ సాగు పద్ధతులకు బదులు ఆధునిక విధానాలను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఉద్యాన శాఖ డీడీ చిట్టిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి హైమవతి, ఉద్యాన అధికారి ఉమాభారతి తదితరులు ఉన్నారు.

## వేసవిలో నీటి కష్టాలు రాకుండా చూడాలి: ఎమ్మెల్యే బత్తుల



**రాజానగరం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణం చేపట్టాల్సిన కీలక పనుల ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను శుక్రవారం ఆదేశించారు. RWS DEE, AEలతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి, చక్రద్వార బందం, వెలుగుబంద, ఫరిజల్లిపేట గ్రామాలలో బోర్ వెల్, ఆర్.ఓ. ప్లాంట్, అవసరమైన చోట్ల పైపు లైన్ నిర్వహణకు అంచనాలు రూపొందించాలని సూచించారు. ఈ చర్యల ద్వారా వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలని ఆయన తెలిపారు.

## నందిగామ వై జంక్షన్ వద్ద పోలీసుల విస్తృత తనిఖీలు...



**నందిగామ మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పట్టణంలోని వై జంక్షన్ వద్ద గురువారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ తిలక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై చర్యలు తీసుకున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నవారిని పోలీసులు ఆపి విచారణ చేశారు. సరైన వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి భారీగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనాల పత్రాలు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. తనిఖీల కారణంగా కొంతసేపు వై జంక్షన్ ప్రాంతంలో వాహనాల రద్దీ కనిపించింది. అయితే రోడ్డు భద్రత కోసం ఇటువంటి తనిఖీలు అవసరమని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వైవీఎల్ నాయుడు మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని చెప్పారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు తరచూ నిర్వహిస్తామని తెలిపారు.

## పకడ్బందీగా జనగణన

### శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



**నరసరావుపేట మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పిలుపునిచ్చారు. నరసరావుపేట లోని వీూవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మొదటి దశ 'గృహాల జాబితా మరియు గృహ వసతుల గణన' శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించి, శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి కృతిక శుక్లా మాట్లాడుతూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మార్చి 6 నుండి 8 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ శిక్షణలో జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. "మన గణన -- మన భవిష్యత్తు" అనే నినాదంతో జరుగుతున్న ఈ మహా యజ్ఞం దేశ ప్రగతికి దిక్సూచి వంటిదని, సేకరించే ప్రతి అంకె అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది అని స్పష్టం చేశారు. గృహ నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, ఇంటర్నెట్ వంటి 33 కీలక అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉంటుందని, సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం చట్టరీత్యా బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణ ప్రియా ,జిల్లా రెవెన్యూ అధికారి నారదముని ,ఆర్డీవో మురళి కృష్ణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంగ్లండ్‌పై భారత్ థ్రిల్లింగ్ విజయం.. ఫైనల్లో న్యూజిలాండ్‌తో పోరు...

**టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్**
**శాంసన్ ఒత్తిడిలో బుమ్రా సూపర్ బౌలింగ్**
**253 చేసినా.. చెమటోడ్చిన టీమిండియా**



**నందిగామ మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు టీమిండియా వరుసగా రెండోసారి అర్హత సాధించింది. వెస్టిండీస్, అమెరికా వేదికగా జరిగిన టోర్నీలో సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై ఉత్కంఠభరిత విజయం సాధించిన భారత్ ముచ్చటగా మూడోసారి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అయినప్పటికీ ఈ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో టీమిండియా చెమటోడ్చింది. ఇంగ్లండ్ ఓపెనర్ జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105; 8 ఫోర్లు, 7 సిక్సర్లు) చివరి వరకూ పోరాడాడు. చివరి ఓవర్లో ఇంగ్లండ్‌కు 30 పరుగులు అవసరమైన దశలో బెతెల్ రనౌట్ కావడం మ్యాచ్‌కు మలుపు తిప్పింది. ఆ తర్వాతి బంతికి ఒక్క పరుగే రావడంతో భారత్ విజయం ఖాయమైంది. చివరి మూడు బంతులను జోఫ్రా ఆర్చర్ సిక్సర్లుగా మలిచినా అప్పటికే ఫలితం మారలేదు. ఈ మ్యాచ్‌లో సంజు సామ్సన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ నిర్ణయం బెడిసికొట్టింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (9) త్వరగా ఔటైనా వికెట్ కీపర్ బ్యాటర్ సంజు సామ్సన్ చెలరేగి ఆడాడు. కేవలం 42 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 89 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. ఇషాన్ కిషన్ (39; 18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి రెండో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అనంతరం శివమ్ దూబే 25 బంతుల్లో 43 పరుగులు చేయగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 11 పరుగులకే వెనుదిరిగాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27) మరియు తిలక్ వర్మ (7 బంతుల్లో 21) దూకుడుగా ఆడడంతో భారత్ స్కోరు 253కు చేరింది.

భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్‌కు శుభారంభం దక్కలేదు. సాల్ట్, బ్రూక్, బాంటన్ త్వరగా ఔటైనా బట్లర్ (25)తో కలిసి బెతెల్ పోరాటం కొనసాగించాడు. సెంచరీతో జట్టును గెలుపు దిశగా నడిపించినా చివర్లో వికెట్లు కోల్పోవడంతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు తీసుకోగా బుమ్రా, అర్ష్‌దీప్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ దక్కించుకున్నారు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్ న్యూజిలాండ్‌తో తలపడనుంది.

టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్‌లో భారత్ భారీ స్కోరు సాధించడంలో సంజు సామ్సన్ మెరుపు బ్యాటింగ్ కీలకమైంది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ నిర్ణయాన్ని అతడు తప్పు చేశాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రం పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ రెండో ఓవర్లోనే ఔటయ్యాడు. అయితే శాంసన్ జోరు ఏమాత్రం తగ్గలేదు. పేసర్ జోఫ్రా ఆర్చర్ షార్ట్ బంతులతో పరీక్షించినా అతడు ధైర్యంగా ఎదుర్కొన్నాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఫైన్ లెగ్ వైపు భారీ సిక్స్ బాదుతూ తన దూకుడును చూపించాడు. 15 పరుగుల వద్ద బ్రూక్ క్యాచ్ వదిలేయడంతో లభించిన అవకాశాన్ని శాంసన్ పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ కేవలం 26 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ కూడా దూకుడుగా ఆడడంతో స్కోరు వేగంగా పెరిగింది. ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 9వ ఓవర్లోనే భారత్ స్కోరు 100 దాటింది.

ఇషాన్ ఔటైన తర్వాత శివమ్ దూబేతో కలిసి శాంసన్ మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించాడు. వీరిద్దరి దూకుడుతో 13 ఓవర్లకే భారత్ 160/2తో బలమైన స్థితిలో నిలిచింది. అనంతరం శాంసన్ ఔటైనా దూబే, తిలక్ వర్మ (21), హార్దిక్ పాండ్యా (27) వేగంగా పరుగులు సాధించారు. చివరి ఐదు ఓవర్లలో భారత్ ఏకంగా 86 పరుగులు రాబట్టి భారీ స్కోరు నమోదు .

**మలుపుతిప్పిన అక్షర్ క్యాచ్...**

భారత ఇన్నింగ్స్‌లో సంజు సామ్సన్ క్యాచ్‌ను ఇంగ్లాండ్ ఫీల్డర్లు వదిలేయడం మ్యాచ్‌కు కీలక మలుపైతే.. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ క్యాచ్ కూడా అంతే కీలకంగా మారింది. జాకబ్ బెతెల్‌తో కలిసి జాక్స్ విలువైన భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఇంగ్లాండ్ వైపు తిప్పే ప్రయత్నం చేశాడు. ఈ జోడీ మరికొంతసేపు క్రీజులో నిలిచుంటే ఫలితం మారిపోయే పరిస్థితి కనిపించింది.

అయితే అర్ష్‌దీప్ సింగ్ వేసిన 14వ ఓవర్ చివరి బంతికి జాక్స్ కవర్స్ వైపు భారీ షాట్ ఆడాడు. దూరం నుంచి పరుగెత్తుకొచ్చిన అక్షర్ పటేల్ అద్భుతంగా బంతిని అందుకున్నాడు. అయితే వేగాన్ని అదుపులో పెట్టుకోలేకపోయిన అక్షర్ చురుకుగా స్పందించి తన ముందున్న శివమ్ దూబే వైపు బంతిని విసిరాడు. వెంటనే దూబే క్యాచ్ అందుకోవడంతో జాక్స్ ఔటయ్యాడు. అధికారికంగా క్యాచ్ దూబే ఖాతాలోకి వెళ్లినా.. ఆ వికెట్‌కు అసలు క్రెడిట్ అక్షర్‌కే దక్కింది.

అంతకుముందు కూడా హ్యారీ బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ సుమారు 28 మీటర్లు వెనక్కి పరుగెత్తి అద్భుతంగా పట్టుకున్నాడు. కీలక సమయంలో అతడి ఫీల్డింగ్ భారత్ విజయానికి పెద్ద కారణమైంది.

**బుమ్రా ఆల్టైమ్ బెస్ట్ బౌలర్: బ్రూక్**

ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ప్రశంసలతో ముంచెత్తాడు. బుమ్రా అత్యుత్తమ బౌలర్ అని, చాలా కాలంగా ప్రపంచంలోనే ఉత్తమ బౌలర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడని పేర్కొన్నాడు. "బుమ్రా అద్భుతమైన బౌలర్. అతడు ఆల్టైమ్ బెస్ట్. కీలక సమయంలో అతడి బౌలింగ్ మ్యాచ్‌పై ప్రభావం చూపింది" అని అన్నాడు.

భారత ఆటగాళ్ల ఫీల్డింగ్ కూడా అద్భుతంగా ఉందని బ్రూక్ చెప్పాడు. ముఖ్యంగా అక్షర్ పటేల్ అందుకున్న క్యాచ్ తన జీవితంలో చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటని కొనియాడాడు. "ఆ క్యాచ్ నిజంగా అద్భుతం. భారత ఆటగాళ్లకు హ్యాట్సాఫ్" అని బ్రూక్ అభినందించాడు.

**ఆ మెరుపులు ఫైనల్ కోసం దాచుకున్నాడా?..అభిషేక్**

గత నెల భారీ అంచనాలతో టీ20 ప్రపంచకప్ బరిలోకి దిగిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మ టోర్నీలో మాత్రం తీవ్రంగా నిరాశపరిచాడు. విరాట్ కోహ్లీ లేని ఈ టోర్నీలో అతడు స్టార్ బ్యాటర్‌గా ఎదుగుతాడని అభిమానులు ఆశించారు. గత ఏడాది ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్న అభిషేక్.. తన కెరీర్‌లోనే అతి పెద్ద టోర్నీలో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. గ్రూప్ దశలో కూడా అతడి ప్రదర్శన ఆశాజనకంగా లేకపోయింది. జింబాబ్వేపై అర్ధశతకం సాధించడం తప్ప టోర్నీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. కీలకమైన దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ మ్యాచ్‌ల్లో వరుసగా 15, 10 పరుగులకే పరిమితమయ్యాడు. సెమీఫైనల్‌లో అయినా చెలరేగుతాడని భావించిన అభిమానులకు మరోసారి నిరాశే మిగిలింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో రెండు ఫోర్లు కొట్టినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేక త్వరగా పెవిలియన్ చేరాడు. వెస్టిండీస్ మ్యాచ్ తరహాలోనే స్పిన్ బౌలింగ్‌లో ముందుకు వచ్చి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో మిడ్ వికెట్‌లో విల్ జాక్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. స్పిన్ బౌలింగ్‌లో స్లో డెలివరీలకు అతడు బలహీనంగా ఉండటాన్ని గుర్తించిన ఇంగ్లండ్ ప్రణాళికాబద్ధంగా అతడిని ఔట్ చేసినట్టు స్పష్టమైంది. అభిమానులు ఊహించని విధంగా అభిషేక్ వరుస వైఫల్యాలు ఎదుర్కొన్నాడు. మరి ఫైనల్లో అయినా తనదైన శైలిలో చెలరేగి జట్టుకు ఉపయోగపడతాడేమో చూడాలి


## నిబంధనలు 'గాలి'కి.. బాణాసంచా విక్రయాలు 'జోరు'గా

**చిలకలూరిపేట మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వేటర్లంపాడు ఘటన పల్నాడు జిల్లా యంత్రాంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. పసుమర్రు, బొప్పూడి గ్రామాల సర్వే నెంబర్లలో వెలసిన బాణాసంచా దుకాణాలపై పోలీస్, ఫైర్, రెవెన్యూ విభాగాలతో కూడిన జాయింట్ కమిటీ మెరుపు దాడులు నిర్వహించింది. అయితే, ఈ తనిఖీల్లో వెల్లడైన అంశాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్న ఈ షాపుల్లో కనీస రక్షణ ప్రమాణాలు మృగ్యమయ్యాయి.

**ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ అంటే ఏమిటి? ఎందుకు లేదు?**

నిబంధనల ప్రకారం.. బాణాసంచా విక్రయదారులు వ్యాపారం ప్రారంభించే ముందు రెండు కీలక అనుమతులు పొందాలి: ప్రొవిజనల్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (చీూజ): ఇది ప్రాథమిక అనుమతి మాత్రమే. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్: షాపులో ఇసుక, అలారం, స్ప్రింక్లర్లు, హైడ్రెంట్ సిస్టమ్ వంటి అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశాక, అధికారులు తనిఖీ చేసి ఇచ్చే అంతిమ అనుమతి పత్రం.

అయితే, చిలకలూరిపేట మండల పరిధిలోని ఏ ఒక్క పెద్ద షాపుకు కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేదని జిల్లా అధికారి



శ్రీధర్ స్పష్టం చేయడం గమనార్హం. కేవలం తాత్కాలిక అనుమతులతోనే ఏళ్ల తరబడి వ్యాపారాలు సాగిస్తుండటం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది.

**తుతూమంత్రంగా భద్రతా ఏర్పాట్లు** ప్రమాదం జరిగితే అదుపు చేయడానికి ఉండాల్సిన పరికరాలు ఈ షాపుల్లో నామమాత్రంగా కూడా లేవు.. **నీటి కుంటలే దిక్కు:** ఫైర్ ఇంజన్లు, ఎలక్ట్రికల్ పంపులు ఉండాల్సిన చోట.. కేవలం చిన్న పైపులు, అక్కడక్కడా ఉన్న నీటి కుంటలతోనే సరిపెట్టారు. **ప్రొవిజనల్ మాయ:** రెండేళ్ల నుండి వ్యాపారం చేస్తున్న ఒక షాపు యాజమాని, కనీసం ప్రొవిజనల్ సర్టిఫికెట్ కూడా లేకుండా ఇప్పుడు తనిఖీలు వస్తున్నాయని పైపులు అమర్చుతుండటం అధికారులను ఆశ్చర్యపరిచింది. **అలారాలు లేవు.. ఇసుక లేదు:** అగ్నిప్రమాదం సంభవిస్తే హెచ్చరించే అలారాలు గానీ, మంటలు ఆర్పే ఇసుక బకెట్లు గానీ ఎక్కడా కనిపించలేదు.

**ప్రాణాలతో చెలగాటం**


దీపావళి సీజన్ కావడంతో ఈ షాపులకు ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఒకవేళ చిన్న నిప్పురవ్వ పడినా, అక్కడ ఉన్న అట్టపెట్టెల మధ్య ప్రాణనష్టం ఊహించలేనంత భారీగా ఉండే అవకాశం ఉంది. "లైసెన్స్ ఉన్న మాకేం కాదు" అనే ధీమాతో యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. **అధికారుల స్పందన :** నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫైర్ అధికారి తెలియజేశారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా వ్యాపారం చేయడం చట్టవిరుద్ధం. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయి అధికారులు కూడా తనిఖీలు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## ఆదర్శ కుటుంబంలో అదిరిపోయే ట్విస్టులు



పెద్దగా హడావిడి చేయకుండా, సైలెంటుగా షూటింగ్ జరుపుకుంటున్న క్రేజీ సినిమాల్లో ఆదర్శ కుటుంబం ఒకటి. వెంకటేష్, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న ఈ మూవీకి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. బ్రేకుల్లేకుండా ప్లానింగ్ కు అనుగుణంగా షూట్ చేసేస్తున్నారు. అక్టోబర్ రెండు విడుదలని టార్గెట్ గా పెట్టుకున్నట్టు టాక్ ఉంది కానీ దీన్ని ఇప్పట్లో అధికారికంగా ప్రకటించకపోవచ్చు. వేసవి నుంచి ప్రమోషనల్ అప్డేట్స్ వదలాలని నిర్ణయించుకున్నారట. ఇది పక్కనపెడితే పైకి టైటిల్ సాఫ్ట్ గా ఉన్నా క్యాప్షన్ లో ఉన్న ఏకే 47కు తగ్గట్టు ఇందులో యాక్షన్ ఎలిమెంట్స్ బలంగా ఉంటాయని ఇన్ సైడ్ టాక్. ఇంటర్వెల్ వరకు సరదాగా సాగుతూ, మల్లీశ్వరి -- నువ్వు నాకు నచ్చావ్ తరహాలో ఫన్ నడిపిస్తూ ఒక్కసారిగా ఇంటర్వెల్ బ్లాక్ దగ్గర పెద్ద మలుపు పెట్టారని వినికిడి. ఇక్కడి నుంచి కథా గమనం మారిపోయి మహేష్ బాబు అతడు తరహా ట్రీట్ మెంట్ తో మాటల మాంత్రికుడు మరోసారి తనదైన మార్కు బయటకి తీస్తారని యూనిట్ లీక్. గుంటూరు కారంలో జరిగిన పొరపాట్లకు ఈసారి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా అల వైకుంఠపురములో ప్లస్ అతడుని కలగలిపి దానికి వెంకీ మార్కు టైమింగ్ జోడిస్తే అదే ఆదర్శ కుటుంబం అంటున్నారు. అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా రూపొందుతోందట. ఈ కాంబో కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూసిన మూవీ లవర్స్ కోరికకు అనుగుణంగా పర్ఫెక్ట్ అవుట్ పుట్ వస్తోందని అంటున్నారు. త్రివిక్రమ్ కు ఆదర్శ కుటుంబం బ్లాక్ బస్టర్ కావడం చాలా అవసరం. ఎందుకంటే నెక్స్ట్ ప్లాన్ చేసుకున్న ప్యాన్ ఇండియా మూవీకి బజ్ మరింత పెరగాలంటే దీంతో అదిరిపోయే హిట్టు కొట్టాలి. గాడ్ అఫ్ వార్ (ప్రచారంలో ఉన్న టైటిల్) జూనియర్ ఎన్టీఆరా లేక అల్లు అర్జునా అనే ప్రచారానికి ఇంకా చెక్ పడలేదు కానీ మే నెలలో తారక్ పుట్టినరోజు సందర్భంగా ఒక క్లారిటీ రావొచ్చని అంటున్నారు. యానిమల్, అర్జున్ రెడ్డి ఫేమ్ హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్న ఈ యాక్షన్ కం ఫ్యామిలీ డ్రామాలో మ్యూజిక్ కూడా హైలైట్స్ లో ఒకటిగా నిలుస్తుందట.

## ఆలస్యం అమృతమవుతుందా మహాశయా



విపరీతమైన పోటీలో సంక్రాంతి పండక్కు విడుదలైన భర్త మహాశయులకు విజ్ఞప్తి అద్భుతాలు చేయకపోయినా గత రవితేజ డిజాస్టర్లతో పోలిస్తే బెటరనే స్పందన, వసూళ్లు తెచ్చుకుంది. రాజా సాబ్ ని పక్కనపెట్టి ర్యాంకింగ్ వేసుకుంటే మన శంకరవరప్రసాద్ గారు, అనగనగా ఒక రాజు, నారి నారి నడుమ మురారి తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. దీన్ని బట్టి ఆడియన్స్ రెస్పాన్స్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. సరే రిజల్ట్ సంగతి పక్కన పెడితే ఒక్క విషయంలో భర్త మహాశయులకు విజ్ఞప్తి రోల్ మోడల్ గా నిలుస్తోంది. అతి ఆలస్యంగా 59 రోజుల తర్వాత మార్చి 13 నుంచి ఓటిటి స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటిదాకా డిజిటల్ లో రాకపోవడం ఆశ్చర్యమే. ఇంత లేట్ వెనుక కారణం నిర్మాణ సంస్థ ఒప్పందం కాదని ఇన్ సైడ్ టాక్. వేర్వేరు రీజన్స్ వల్ల ఓటిటి వైపు నుంచే జాప్యం జరిగిందని అంటున్నారు. అసలే ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చ జరుగుతోంది. టాలీవుడ్ సినిమాలు ఏవైనా థియేటర్, ఓటిటి మధ్య కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల గ్యాప్ ఉండాలనే ప్రతిపాదన మీద నిర్మాతల మండలి సీరియస్ గా విశ్లేషణ చేస్తోంది. సాధ్యాసాధ్యాల గురించి డిస్కషన్లు జరుగుతూనే ఉన్నాయి. ఇలా చేయడం వల్ల చిన్న నిర్మాతలు నష్టపోతారని, పెద్ద ప్రొడ్యూసర్లు సైతం రెవిన్యూలో అధిక భాగం కోల్పోవాల్సి వస్తుందని, ముఖ్యంగా డిజాస్టర్లకు పెద్ద దెబ్బ పడుతుందని రకరకాల అభిప్రాయాలు వినపడుతున్నాయి. ఇలాంటి టైంలో భర్త మహాశయులకు విజ్ఞప్తి లేటుగా ఓటిటి ఎంట్రీ ఇవ్వడం ఆసక్తి రేపుతోంది. ఒకవేళ వ్యూస్ కనక భారీగా వస్తే అదో సానుకూల సంకేతంగా చూడొచ్చు. ఎందుకంటే థియేట్రికల్ గా భారీ వసూళ్లు తేని సినిమా రెండు నెలల తర్వాత కూడా డిజిటల్ లో జనాన్ని ఆకట్టుకుందంటే ఖచ్చితంగా ఆలోచించాల్సిన విషయం అవుతుంది. హిందీ, మలయాళం లాగా మనమూ లేట్ విండో అమలు చేయాలని అగ్ర నిర్మాతలు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. అసాధ్యం కాదు కానీ అందరికీ ఒప్పించడం పెద్ద సవాల్ లాంటిది. ఏకాభిప్రాయం వస్తే పరిశ్రమకు మంచిదే. కాకపోతే ఓటిటిలు ఎలా రియాక్ట్ అవుతాయనేది చూడాలి.

## 'ఉస్తాద్' తప్పు దిద్దుకున్న బుక్ మై షో



ఒక బ్రేక్ తర్వాత సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చాక వరుసగా రీమేక్ సినిమాలే చేస్తూ వచ్చాడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. అభిమానులతో పాటు ప్రేక్షకుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనా ఆయన పట్టించుకోలేదు. ఐతే ఈ రీమేక్ పరంపరకు గత ఏడాది బ్రేక్ పడింది. స్ట్రెయిట్ సినిమాలు హరిహర వీరమల్లు, ఓజీలతో ప్రేక్షకులను పలకరించాడు. వీటిలో తొలి సినిమా నిరాశపరిచినా.. రెండో చిత్రం మంచి ఫలితాన్నందుకుంది. ఇక పవన్ చేతిలో ఉన్న ఏకైక చిత్రం.. ఉస్తాద్ భగత్ సింగ్. ఇది తమిళ బ్లాక్ బస్టర్ 'తెరి'కి రీమేక్ అనే అభిప్రాయంతోనే మొదట్నుంచి అందరూ ఉన్నారు. కానీ 'ఉస్తాద్..' రీమేక్ కానే కాదంటూ ఇటీవలే దర్శకుడు హరీష్ శంకర్ నొక్కి వక్కాణించాడు. నా సినిమాలో ఒక ఎపిసోడ్‌ను తమ చిత్రంలో పెట్టుకున్న 'తెరి' మూవీని నేనెందుకు రీమేక్ చేస్తా, 'కథ-మాటలు-దర్శకత్వం' అని కార్డ్ ఎందుకు వేసుకుంటా అని ఆయన ప్రశ్నించారు. దీంతో ఇది స్ట్రెయిట్ మూవీనేలే అని ఫ్యాన్స్‌లో ఉత్సాహం వచ్చింది. ఐతే స్వయంగా దర్శకుడే మీడియా ఇంటర్వ్యూల ద్వారా ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చాడు కానీ.. బుక్ మై షో వాళ్లు మాత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' రీమేకే అని సంకేతాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ప్రతి సినిమాకు బుక్ మై షోలో సినాప్సిస్ ఇవ్వడం కామనే. చాలావరకు అది చిత్ర బృందం నుంచి తీసుకున్న సమాచారమే ఉంటుంది. ఐతే 'ఉస్తాద్..' కథా సారాంశం గురించి చెబుతూ.. ఒక ఐపీఎస్ అధికారి తన కూతురితో కలిసి అజ్ఞాతావాసంలో ఉంటాడని.. అంతకుముందు అతడి కుటుంబాన్ని కొందరు నాశనం చేస్తారని.. ఒక సందర్భంలో తన ఐడెంటిటీ బయటపడిపోవడంతో మళ్లీ తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఆ అధికారి ఏం చేశాడన్నది ఈ కథ అని అందులో పేర్కొన్నారు. ఈ సినాప్సిస్ 'తెరి'దే అని ఆ సినిమా చూసిన వాళ్లందరికీ అర్థమైపోతుంది. దీంతో హరీష్ ఒకవైపు రీమేక్ కాదు మొర్రో అంటుంటే.. బీఎంఎస్ వాళ్లు మాత్రం ఇది 'తెరి' రీమేక్ అన్నట్లుగా సినాప్సిస్ ఇవ్వడమేంటి అని పవన్ ఫ్యాన్స్ అయోమయంలో పడిపోయారు. సోషల్ మీడియాలో దీని గురించి చర్చ జరిగింది.




## చైతూ విలన్... బాలీవుడ్ సందీప్ వంగ!



కొందరు సినీ ప్రముఖులు మాట్లాడుతుంటే అందరూ అలెర్ట్ అవుతారు. వాళ్ల మాటతీరు భయం గొల్పేలా ఉంటుంది. ఎప్పుడూ ఫైర్ మీద ఉన్నట్లుగా కనిపించే ఆ వ్యక్తులు.. ఎప్పుడు ఏం చేస్తారో అన్నట్లుగా కంగారు పుట్టిస్తుంటారు. 'అర్జున్ రెడ్డి'తో టాలీవుడ్లో సెన్సేషన్ క్రియేట్ చేసి... కబీర్ సింగ్, యానిమల్ మూవీస్‌లో బాలీవుడ్‌లోనూ ప్రకంపనలు రేపిన సందీప్ రెడ్డి వంగ ఈ కోవకే చెందుతాడు. ప్రెస్ మీట్లలో, ఇంటర్వ్యూల్లో, స్టేజ్ మీద మాట్లాడేటపుడు సందీప్ చాలా సీరియస్‌గా కనిపిస్తుంటాడు. తనకు ఎవరైనా బ్రేక్ వేయాలని చూస్తే గట్టి పంచ్ వేయడానికి వెనుకాడడు. ఇప్పుడు సందీప్ రెడ్డి వంగను గుర్తు చేసేలా ఒక యువ నటుడు మాట్లాడ్డం సోషల్ మీడియా దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ నటుడి పేరు.. స్పర్శ్ శ్రీవాస్తవ. ఇతను బాలీవుడ్ క్లాసిక్ 'లాపతా లేడీస్'తో నటుడిగా చాలా మంచి పేరు సంపాదించాడు. అందులో అమాయకమైన పల్లెటూరి భర్త పాత్రలో స్పర్శ్ అదిరిపోయే పెర్ఫామెన్స్ ఇచ్చాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్.. త్వరలోనే టాలీవుడ్లోకి అడుగు పెడుతున్నాడు. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య హీరోగా రూపొందుతున్న 'వృష కర్మ'లో స్పర్శ్ విలన్ పాత్ర చేశాడు. నిన్న రిలీజ్ చేసిన టీజర్లో అతనే హైలైట్ అయ్యాడు. టీజర్లోనే జనాలను భయపెట్టేశాడు స్పర్శ్.


ఐతే తెర మీదే కాదు.. బయట కూడా అతను జనాలను కాస్త కంగారు పెట్టేలాగే మాట్లాడాడు. టీజర్ లాంచ్ కార్యక్రమంలో అతను చాలా సీరియస్ స్పీచ్ ఇచ్చాడు. ఐతే స్పర్శ్ ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నానంటూ ఇంగ్లీషులో మాట్లాడుతుంటే.. ఆడిటోరియంలో ఉన్న లేడీ జర్నలిస్ట్ గట్టిగా ఇంగ్లీష్ వద్దు అని చెప్పడంతో తను హిందీలో మాట్లాడడం మొదలు పెట్టాడు.. మళ్ళీ వెంటనే ఆవిడ అడ్డుచెప్పడంతో... నేను హిందీలో మాట్లాడే ప్రయత్నం చేస్తుంటే.. మీరు అడ్డుతగులుతున్నారంటూ.. వచ్చి మీరే మాట్లాడుకోండి అనేశాడు స్పర్శ్. దీంతో అక్కడ వాతావరణం కొంచెం వేడెక్కింది. స్పర్శ్ హావభావాలు, మాటతీరు చూస్తే అక్కడ ఉన్న వాళ్లకు సందీప్ రెడ్డి వంగనే గుర్తుకొచ్చాడు. బాలీవుడ్లోనూ ఒక వంగ ఉన్నాడంటూ.. యానిమల్ బీజీఎం వేసి కొందరు ఈ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండడం విశేషం.



# బిజినెస్ న్యూస్



## 25వేల బడ్జెట్‌లో ఫోన్ చూస్తున్నారా? మోటో నుంచి కొత్త ఫోన్



ఎడ్జ్ సిరీస్ ఫోన్లతో ఇండియన్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో తనకంటూ ప్రత్యేక మార్క్ సంపాదించిన మోటోరొలా.. ఎడ్జ్ 70 సిరీస్‌లో కొత్త ఫోన్‌ను లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీతో ఎడ్జ్ 70 ఫ్యూజన్‌ను విడుదల చేసింది. రూ.25 వేల బడ్జెట్‌లో పేరొందిన బ్రాండ్‌లో మంచి స్మార్ట్‌ఫోన్ కోసం చూస్తున్నవారు ఈ ఫోన్‌ను పరిశీలించొచ్చు. ఇంతకీ ఈ ఫోన్ ఎలా ఉంది? అప్‌డేట్స్ మాటేంటి? మోటోరొలా ఎడ్జ్70 ఫ్యూజన్ 6.78 అంగుళాల సూపర్ హెచ్‌డీ 1.5ఖ ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ డిస్‌ప్లేతో తీసుకొచ్చారు. 144 ఎట, హెచ్‌డీఆర్ 10ం, 5,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో ఈ డిస్‌ప్లే పనిచేస్తుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటక్షన్ ఉంది. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 4 ప్రాసెసర్ ఇచ్చారు. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత హెలోయూఐతో పనిచేస్తుంది. 3 ఏళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ-710 ప్రధాన కెమెరా ఉంది. 13 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, 3 ఇన్ 1 లైట్ సెన్సర్ ఇచ్చారు. ముందువైపు 32 ఎంపీ కెమెరా ఉంది. ఇందులోని 7000 ఎంఏహెచ్ బ్యాటరీ 68ఔ టర్బోపవర్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. దీని బరువు 193 గ్రాములు. ఇక ధర విషయానికొస్తే.. మోటో ఎడ్జ్ 70 ఫ్యూజన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం 128జీబీ వేరియంట్ రూ.26,999, 8జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.29,999, 12జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.32,999గా నిర్ణయించారు. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లపై రూ.2 వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. లేదా పాత ఫోన్ ఎక్స్ఛేంజీపై రూ.2వేలు అదనంగా ఇస్తోంది. దీంతో ఈ ఫోన్ ధర రూ.24,999 నుంచే ప్రారంభమవుతుంది. మార్చి 12 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటో వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. నేటి (మార్చి 6న) మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఫ్లిప్‌కార్ట్‌లో ఎర్లీబర్డ్ సేల్ నిర్వహించనున్నారు.

## టెస్లా కార్లకు యాక్సిస్ బ్యాంక్ లోన్లు




ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లాకు ప్రిఫర్డ్ ఫైనాన్సర్‌గా వ్యవహరించే దిశగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. దీనితో దేశవ్యాప్తంగా టెస్లా కస్టమర్లకు ప్రత్యేక రుణ సదుపాయాలను అందించనున్నట్లు వివరించింది. ప్రధాన నగరాలు, వర్ధమాన ఈవీ హబ్‌లలో డిజిటల్ ఫైనాన్సింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ప్రీమియం ఈవీ కొనుగోలుదారుల కోసం అనువైన రీపేమెంట్ పథకాలు, గరిష్ఠంగా 10 ఏళ్ల రుణ వ్యవధి, డిజిటల్ ఆన్‌బోర్డింగ్ మొదలైన సౌకర్యాలతో రుణాలను అందించనున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఈడీ మునీష్ శర్మా తెలిపారు. ఈ భాగస్వామ్యంతో టెస్లా వాహనాల కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. కస్టమర్లు డీలర్‌షిప్‌ల వద్దే లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తక్షణ రుణ ఆమోదం పొందే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో భారతదేశంలో ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడంతో పాటు ఈవీ మార్కెట్ విస్తరణకు కూడా ఈ ఒప్పందం దోహదపడుతుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## బేర్ మళ్లీ వచ్చింది: భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్‌లు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో లాభాలు చవిచూసిన సూచీలు.. ఒక్కరోజు తిరగక ముందే మళ్లీ బేర్ గుప్పిట్లోకి వెళ్లాయి. సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 24,500 మార్కు దిగువన ముగిసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం మున్ముందు మరింత తీవ్ర రూపం దాలుస్తుందన్న భయాలు సూచీలను పడేశాయి. 'అసలు కథ ఇప్పుడే మొదలైందంటూ' అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలు దీనికి ఆజ్యం పోశాయి. సెన్సెక్స్ ఉదయం 79,658.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,015.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఆరంభంలో ఓ మోస్తరు నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఆఖర్లో మరింత అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో ఇంట్రాడేలో 78,812.18 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1097 పాయింట్ల నష్టంతో 78,918.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315.45 పాయింట్ల నష్టంతో 24,450.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 91.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, రిలయన్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 86.98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5082 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కారణాలు ఇవీ..

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం ఇప్పుడే ముగిసే సూచనలు కనిపించడం లేదు. అసలు యుద్ధం ఇప్పుడే మొదలైందంటూ అమెరికా రక్షణ మంత్రి పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇరాన్‌పై యుద్ధం విషయంలో టైమ్ లిమిట్ అంటూ ఏమీ పెట్టుకోలేదని వ్యాఖ్యానించడం యుద్ధం దీర్ఘకాలం కొనసాగొచ్చన్న అంచనాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తలతో చమురు ధరలు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగుతుండడం కూడా దిగుమతులపై ఆధారపడే మన దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న భయాలు నెలకొన్నాయి. ద్రవ్యోల్బణం, వృద్ధిపై భయాలు నెలకొన్నాయి.

దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో రూ.3762 కోట్ల విలువైన షేర్లు విక్రయించినట్లు ఎన్‌ఎస్‌ఈ డేటా చెబుతోంది. ఒక్క మార్చి నెల్లో రూ.21,436 కోట్ల విలువైన షేర్లను ఎఫ్‌ఐఐలు విక్రయించడమూ ప్రతికూల ప్రభావం చూపింది.

## టాటా స్టీల్ రూ. 11,000 కోట్ల పెట్టుబడులు




అధునాతన గ్రేడ్ ఉక్కును తయారు చేసే దిశగా జంషెడ్‌పూర్ ప్లాంటుపై రూ. 11,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలు ఉన్నట్లు టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. ఇందుకోసం తాము రూపొందించిన టెక్నాలజీతో ఉక్కు ప్రాసెసింగ్ వేగవంతమవుతుందని, అలాగే కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయని చెప్పారు. నెదర్లాండ్స్‌లో ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం అయిన నేపథ్యంలో 2030 నాటికి జంషెడ్‌పూర్‌లో 1 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చంద్రశేఖరన్ చెప్పారు. హైడ్రోజన్ ట్రక్కులపై కూడా టాటా మోటర్స్ ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించారు. ఇక జార్ఖండ్‌లో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని టాటా గ్రూప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# రైల్వేజోన్ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలి

## ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ



**విశాఖపట్నం మార్చి 06 (నేటి మనదేశమ్) :** భవన నిర్మాణాలతో నిమిత్తం లేకుండా విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ డిమాండ్ చేశారు. గురువారం అజశర్మ నేతృత్వంలో వేదిక బృందం విశాఖపట్నం, ముడసర్లోవ ప్రాంతంలో నిర్మిస్తున్న రైల్వే జోన్ భవన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఈనెల1 నుంచి 5 వరకే ప్రధాన సమస్యల అధ్యయనానికి చేపట్టిన పర్యటనలో భాగంగా 52 ఎకరాలలో నిర్మిస్తున్న రైల్వే జోన్ భవన సముదాయం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు ఏదశలో ఉన్నాయి, ఎప్పటిలోగా పూర్తవుతాయనే అంశాలపై ఇంజనీరింగు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, 2014లో రాష్ట్ర విభజన చట్టంలో విశాఖ రైల్వేజోన్ ఏర్పాటును ప్రకటించగా, పలు ఆందోళనల తర్వాత పదేళ్లకు పనులు మొదలెట్టారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తయ్యేందుకు మరో రెండేళ్లయినా పడుతుందన్నారు. అంతవరకు ఆగకుండా రైల్వేజోన్ కార్యకలాపాలను ప్రారంభించాలన్నారు. విశాఖలో రైల్వేకుపెద్ద ఎత్తున భూములు, 700 ఎకరాలు ఖాళీ స్థలాలు, ఖాళీగా డిఆర్ఎం కార్యాలయం కూడా ఉందన్నారు. వాటిల్లో తాత్కాలికంగా జోన్ కార్యకలాపాలను ప్రారంభించి, శాశ్వత భవన నిర్మాణాలు పూర్తయితే అందులోకి మారే అవకాశం ఉన్నందున ఆ దిశగాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సందర్శనలో కె.సత్యనారాయణ, కె.వెంకటరావు, ఎన్.నాగేశ్వర్రావు, పిట్లా నారాయణమూర్తి, వి.నరేంద్రకుమార్, పి.శంకర్, ఐ,సి.నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

**దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కోవడం తగదు**

ఆనందపురం: గూగుల్ డేటా సెంటర్ పేరుతో దళితుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం సరికాదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజ శర్మ అన్నారు. గురువారం తర్లువాడ గ్రామాన్నిసందర్శించి గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను వేదిక బృందం పరిశీలించింది. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అజ శర్మ మాట్లాడుతూ, దళితులకు ఇచ్చిన డిపట్టా భూముల్లో జీడి, మామిడి తోటలు వేసుకుని జీవనోపాధి పొందుతున్న నేపథ్యంలో వాటిని గూగుల్ డేటా సెంటర్‌కు తీసుకోవడం సరికాదన్నారు.250 మంది దళితులు సాగులో ఉన్నప్పటికీ 49 మందికి మాత్రమే పట్టాలు ఉన్నాయని,అయినప్పటికీ సాగుదారులైన దళితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ చెల్లించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటైతే పరిసర గ్రామాలను కూడా తరలించే పరిస్థితి రావచ్చన్నారు. భూములు పరిశీలించిన వారిలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక విశాఖ జిల్లా కో కన్వీనర్ కూన వెంకట్రావు, కన్వీనర్ ఎన్ నాగేశ్వరరావు ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సంఘం జనరల్ సెక్రెటరీ కె సత్యనారాయణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేద్కర్, సిఐటియు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మణికుమార్ పాల్గొన్నారు

# నెయ్యికల్తీపై వాస్తవాలు వెలుగులోకి రావాలి

## - ఎంత పెద్దవారున్నా శిక్షపడాలి - సినీ నటుడు సుమన్



**తిరుపతి (మంగళం) మార్చి 06 (నేటి మనదేశమ్) :**'తిరుమల స్వామివారి లడ్డూలో ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందనే అంశంపై దేశ వ్యాప్తంగా శ్రీవారి భక్తులు బాధపడుతున్నారు. నేను ఎక్కడికి వెళ్లినా ఇదే అంశాన్ని అడుగుతున్నారు. ఇందులో నిజాలు వెలుగులోకి వచ్చేలా కమిటీ విచారణ జరగాలి. ఎంత పెద్దవారున్నా శిక్షపడాలి అని సినీ నటుడు సుమన్ కోరారు. తిరుపతిలోని తిరు మలనగర్‌లో గురువారం ఆయన నటించిన ధర్మస్థల నియోజకవర్గం సినిమా ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'వేంకటేశ్వరస్వామిగా నటించిన మీరు లడ్డూ కల్తీ వ్యవహారంపై మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన మాట్లాడారు. 'కల్తీ జరిగిందని ఊరికే ఆరోపణలు చేయడం కాదు. దాన్ని నిరూపించేలా బలమైన విచారణ జరగాలి. ఇప్పటివరకు జరిగిన విచారణలో కల్తీ జరిగిందని కొందరు, జరగలేదని కొందరు వాదనలకు దిగుతున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కోరుతున్నా, ఒక సిన్సియర్ కమిటీని పెట్టండి. బలమైన ఇన్వెస్టిగేషన్ టీమ్‌ను పెట్టి నిజాలు వెలుగులోకి తేవాలి. కల్తీ జరిగి ఉంటే అందులో ఎంతపెద్ద అధికారి ఉన్నా, నాయకులు ఉన్నా శిక్ష పడేలా చూడాలి. కల్తీకి పాల్పడినవారు మళ్లీ తిరుమల, తిరుపతి దేవస్థానంలో అడుగు పెట్టకుండా చర్యలు తీసుకోవాలి' అని కోరుతున్నానని

# శ్రీకూర్మక్షేత్రంలో డోలోత్సవం



**గార, మార్చి 06 (నేటి మనదేశమ్) :** శ్రీకూర్మక్షేత్రంలో డోలోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత గోవందరాజస్వామివారిని మేళతాళాలతో తిరువీధిగా డోల మండపానికి అర్చకులు తీసుకెళ్లి అక్కడ ఊయల్లో ఉంచారు. ఈ సందర్భంగా స్వామివారికి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు విజయనగర పూసపాటి గజపతుల గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక ఊజలు నిర్వహించారు. అనంతరం స్వామిని భక్తులు ఉత్తరాభిముఖంగా దర్శించు కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్ల సీతారామ నరసింహాచార్యులు వైదిక కార్య క్రమాన్ని నిర్వహించారు. అలాగే భక్తులకు శ్రీకూర్మం నవజీవన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

# పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష



**విశాఖపట్నం మార్చి 06 (నేటి మనదేశమ్) :** రాష్ట్ర ప్రభుత్వం సిఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సందర్భంగా పర్యాటక రంగంలో కుదుర్చుకున్న 43 ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలని మెట్రో పాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఈ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పర్యాటక ప్రాజెక్టుల స్థాపనలో ఎదురవుతున్న అడ్డం కులను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అధిగమించాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో నిర్మాణాలకు సంబంధించి నేవీ, ఎయిర్‌పోర్స్ అథారిటీ, జివిఎంసి వంటి సంస్థల నుండి రావాల్సిన అనుమతులు సత్వ రమే మంజూరయ్యేలా చేసి, పెట్టుబడిదారులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి మాధవి, జివిఎంసి, యుసిడి, కెపిఎంజి కన్సల్టెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంధుల పాఠశాలలో సేవా కార్యక్రమాలు



**మధురవాడ, మార్చి 06 (నేటి మనదేశమ్) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం సాగర్ నగర్‌లోని అంధబాలికల పాఠశాలలో గీతం ఆర్కిటెక్చర్ డీన్, డైరక్టర్ విభూతి సత్యదేవ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గీతం ఎన్ఎస్ఎస్.ప్రోగ్రామ్ ఆఫీసర్ మర్రి జ్యోతి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, సమాజ సంక్షేమం, టెక్నాలజీపై వివరించారు. వివిధ పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. డిజిటల్ టెక్నాలజి గురించి వివరించారు. పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఃగుడ్‌టచ్-బ్యాడ్ టచ్ః అంశాలపై అవగాహన నిర్వహించారు. అంధ విద్యార్థులకు బ్రెయిలీ అక్షరాల ప్యానెల్, చారిత్రక కట్టడాల స్పర్శ నమూనాలు, స్పర్శ మ్యాప్‌లు, చిహ్నాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వయంగా తయారు చేశారు. విద్యార్థుల జ్ఞానేంద్రియ శిక్షణను మెరుగుపరచడానికి కూరగాయల తోట, సెన్సరీ గార్డెన్‌చ చెప్పులు లేకుండా నడిచే సెన్సరీపాత్‌వే ఏర్పాటు చేశారు. గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ అభినందించారు కార్యక్రమంలో ఐజిబిసి కోఆర్డినేటర్ దివ్యహారిణి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ సిద్ధం : జెసి




**భీమవరం, మార్చి 06 (నేటి మనదేశమ్) :** రబి సీజన్ ధాన్యం కొనుగోలుకు అధికారులు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం పౌర సరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా శాఖలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెల 20వ తేదీ తర్వాత రైతుల నుండి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం మండలాల్లో ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయాలన్నారు. తేమ శాతం కొలిచే యంత్రాలను క్యాలిబ్రేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంక ేటేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.సరోజ, మేనేజర్ ఎమ్‌డి ఇబ్రహీం పాల్గొన్నారు. జిల్లాలోని ఆక్వా రైతుల సమస్యలపై జెసి కలెక్టరేట్‌లో మత్స్య శాఖ, తూనికలు- కొలతలు, కమర్షియల్ టాక్స్, ఎంపెడ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ఆక్వా రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాలని, అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టనున్న జనగణన 2027ను జిల్లాలో సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జెసి సూచించారు. మొదటి దశ 'గృహాల జాబితా, గృహ వసతుల గణన' శిక్షణా కార్యక్రమం మూడవ రోజు ఆయన పాల్గొని శిక్షణ తీరును పరిశీలించారు. అధికారులు వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని,

సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. డిఆర్ఓ బి.శివ న్నారాయణ రెడ్డి, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ బి.రమాదేవి పాల్గొన్నారు.

# అనకాపల్లికి పండుగ శోభ

## భారీ ఎత్తున ఏర్పాట్లు

**అనకాపల్లి మార్చి 06 (నేటి మనదేశమ్) :**స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభానికి భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఎనిమిదో తేదీన ఉదయం 10.58 గంటలకు శుభ ముహూర్తంగా వేదపండితులు నిర్ణయించారు. నూకాంబిక అమ్మవారి ప్రధాన ఆలయం పునఃప్రారంభం, రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ, యజ్ఞయాగాదుల వంటి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ తెలిపారు. ఆలయంతోపాటు రాజగోపురాన్ని వివిధ రకాల రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సుమారు 100 అడుగుల ఎత్తున నిర్మించిన రాజగోపురంపై పలు దేవతా మూర్తుల విగ్రహాలను తీర్చిదిద్దారు. మహా సంప్రోక్షణ, యజ్ఞం వంటి కార్యక్రమాల నిర్వహణ కోసం తాటాకు పందిళ్లతో యాగశాలను నిర్మించారు. ఆలయంతోపాటు ప్రాంగణం మొత్తం విద్యుద్దీపాలతో అలం కరిస్తున్నారు. కాగా ఆలయ పునర్నిర్మాణం కోసం సుమారు మూడేళ్ల నుంచి అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహించడంలేదు. ఇప్పుడు ఆలయ నిర్మాణం పూరికావడంతో ఆదివారం ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

# ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



**పోలాకి, మార్చి 06 (నేటి మనదేశమ్) :** ప్రియా గ్రహారంలో వేంచేసి ఉన్న లలిత త్రిపురాంతకవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల దేవస్థానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన డోలోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 33 జట్లు పాల్గొన్నాయి. తెలుగుయువత పార్లమెంటరీ యువ నాయకులు మెండ దాసునాయుడు, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, జనసేన నాయకుడు ప్రదీప్‌కుమార్, మెట్ట వైకుంఠరావు, పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఉత్సవాల్లో పాల్గొన్నారు.

సర్పంచ్ బెవరనూకరాజు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, ఎంపీటీసీ ప్రసాదరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ పురోహితులు శ్రీనా?థ్‌శర్మ ఆధ్వర్యంలో పుష్పాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు.

# భారతీయ విద్యార్థులకు అంతర్జాతీయ వైద్య విద్య

## - ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ లక్ష్యం
## - సంస్థ డైరెక్టర్ సునీత లావణ్య



**విశాఖపట్నం మార్చి 06 (నేటి మనదేశమ్) :** భారతీయ విద్యార్థులకు అంతర్జాతీయ వైద్య విద్యావకాశాలను అందించడమే ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ ప్రైవేట్ లిమిటెడ్ లక్ష్యమని డైరెక్టర్, కైట్స్ నోబుల్ స్కూల్ భాగస్వామి, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 మహిళా సాధికారత చైర్‌పర్సన్ రొటేరియన్ కె. సునీత లావణ్య అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రతినిధితో మాట్లాడారు. 2003లో సంస్థను ప్రారంభించినప్పటికీ, పారదర్శకత, నిబద్ధత విద్యార్థికేంద్రిత సేవలతో అభివృద్ధి చెందుతూ 2008లో విశాఖ నగరంలోని అక్కయపాలెం ఎన్‌జివోస్ కాలనీలో అధికారిక కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. కిర్గిజ్‌స్తాన్ లోని ప్రముఖ వైద్య విశ్వవిద్యాలయం 'ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన'?కు అధికారిక అడ్మిషన్ భాగస్వామిగా ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ భారతదేశంలో సేవలందిస్తోందని తెలిపారు. స్థానిక యూనివర్సిటీ కార్యాలయం ద్వారా తల్లిదండ్రులకు సమగ్ర కౌన్సెలింగ్, అడ్మిషన్ సహాయం, వీసా గైడెన్స్, విద్యార్థులకు నిరంతర అకడమిక్ మద్దతు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సంస్థ మార్గదర్శకత్వంలో ఐదు వేల మందికిపైగా విద్యార్థులు వైద్య విద్యను పూర్తిచేసి డాక్టర్లుగా సేవలందిస్తున్నారని, అందులో దాదాపు 200 మంది పీజీ డాక్టర్లు విదేశాల్లో స్థిరపడి అంతర్జాతీయ ఆరోగ్య రంగంలో ప్రతిష్ఠతో కొనసాగుతున్నారని వివరించారు. ఈ విజయాలు సంస్థ విశ్వసనీయతకు నిదర్శనమని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సందేశమిస్తూ, 'మహిళ చదువుకుంటే ఒక కుటుంబం ఎదుగుతుందని, మహిళ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే సమాజం పురోగమిస్తుందన్నారు. మహిళ బలంగా ఉంటే కుటుంబం, తద్వారా సమాజం బలంగా ఉంటుందన్నారు. మహిళ సాధికారతే దేశాభివృద్ధికి పునాది అని స్పష్టం చేశారు.

# పావలా వడ్డీకే రూ.లక్ష రుణం

## - పిల్లల చదువుకు విద్యాలక్ష్మీ.. పెళ్లికి కళ్యాణలక్ష్మీ - ఈ నెల 8న కొత్త పథకాలు ప్రారంభం

**సంతబొమ్మాళి/ మెళియాపుట్టి, మార్చి 06 (నేటి మనదేశమ్) :** డ్వాక్రా మహిళల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. స్వయంశక్తి సంఘాల్లోని మహిళల పిల్లల విద్య కోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మీతోపాటు కుమార్తె వివాహానికి ఎన్టీఆర్ కళ్యాణ లక్ష్మీ పథకాలు ప్రవేశపెట్టనుంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ఈ రెండు పథకాలు ప్రారంభించనుంది. కేవలం పావలా(నాలుగు శాతం) వడ్డీతో అర్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు అందజేయనుంది. కనీసం ఆరు నెలల కిందట డ్వాక్రా సంఘంలో చేరి.. గతంలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించిన వారికే ప్రాధాన్యమివ్వనుంది. రుణగ్రహీత ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణం మాఫీ చేయనుంది. జిల్లాలో 48,906 మహిళా సంఘాల్లో 5,37,133 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ అవసరం మేరకు ఈ పథకాల ద్వారా లబ్ధి చేకూరనుంది.

## బ్రాహ్మణులు అందరినీ కలుపుకుంటూ హిందూ ధర్మంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలి



**మచిలీపట్నం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సంకష్ట హర చతుర్థి సందర్భముగా సర్వేజనా సుఖినోభవంతు అంటూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటి ఆధ్వర్యంలో బ్రాహ్మణ సేవా సంఘం వారు బుట్టాయిపేట శ్రీ చిట్టి పిళ్ళా రయ్య స్వామి వారి దేవాలయములో లోక సంక్షేమం కొరకు శుక్రవారం స్వామివారికి అభిషేకము లు, అర్చన లు, శ్రీ లక్ష్మీ గణపతి హోమం లను బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ దంపతు లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ సేవా సంఘం వారి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రముఖ వైద్యులు, బ్రాహ్మణ సేవా సంఘం సీనియర్ నాయకుడు, డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణులు అందరినీ కలుపుకుంటూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి అని కోరారు. బ్రాహ్మణులు సమాజ సేవలో ముందు ఉంటూ, సమాజాభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయడం మన బాధ్యత అన్నారు. బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ పిల్లలకు సంధ్యావందనం ఉచితంగా నేర్పించడం జరుగుతుందని, భవిష్యత్తు తరాలకు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే బాధ్యత తల్లిదండ్రులపై ఎంతో ఉంది అన్నారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని అటువంటి ధర్మ పరిరక్షణలో మనం మనతోపాటు ఉన్నవారందరినీ కలుపుకుంటూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలి అన్నారు. దేవాలయాలు మన సంస్కృతికి చిహ్నాలని, అటువంటి దేవాలయాలలో మంచి మంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి దేవాలయంలోనూ అర్చకుడితోపాటు, ఒక బ్రాహ్మణుడిని దేవాలయ కమిటీలలో నియమించడం జరిగిందని, ఆ కమిటీలలో ఉన్న బ్రాహ్మణులు దేవాలయాల అభివృద్ధికి చక్కటి సూచనలు, సలహాలు ఇస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు దేవాలయాల్లో వెల్లివిరిసేలా విశేష కృషి చేయాలి అని కోరారు. బ్రాహ్మణులకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పెద్దల దృష్టికి ఆ సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఫణి కుమార్ పలువురు బ్రాహ్మణులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు, మోపర్తిసుబ్రమణ్యం, కానుకొలను ఫణి కిరణ్ శర్మ, సింగరాజు గోవర్ధన్, వడ్లమన్నాటి మారుతి దివాకర్, జమ్మలమడక సేతురామయ్య, జొన్నలగడ్డ కాంత్, దిట్టకవి వెంకటేశ్వరరావు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, నిమ్మగడ్డ శ్రీధర్, సర్వా లలిత కుమారి, జొన్నలగడ్డ మాధవి తదితరులతో పాటు జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి నూతన సూపర్నెంట్ గా బాధ్యతలు స్వీకరించిన డా. లీలా ప్రసాద్




**మచిలీపట్నం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి నూతన సూపర్నెంట్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ లీల ప్రసాద్. ఇటీవల ప్రభుత్వం నూతన సూపర్నెంట్ గా లీలా ప్రసాద్ ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆసుపత్రి లో పలువురు డాక్టర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా భాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్ డా.లీలా ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ముందుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కొన్ని సమస్యలు బడ్జెట్ తో ముడి పడిన అంశాలు కూడా ఉంటాయి అని వాటిని ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ లు, డాక్టర్లు, ఆఫీస్ ఏ డి, ఏఓ, సహచర డాక్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన సదస్సు.



**మచిలీపట్నం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ చోడే వీర వెంకట సత్య బాపిరాజు అసిస్టెంట్ కమిషనర్ ఎం. గోపాల్ రావు మార్గదర్శకత్వంలో, నగరాన్ని శుభ్రంగా ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో స్వచ్ఛ సర్వేక్షన్ 'స్వచ్ఛోత్సవ్ 2026' కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ స్కూలు నందు చెత్త విభజన పరిశుభ్రతపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, సమాజం పట్ల వారికి ఉన్న బాధ్యతను గుర్తు చేశారు. కేవలం పరిసరాల పరిశుభ్రత మాత్రమే కాకుండా, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంత ముఖ్యమో వివరించడం జరిగినది. ముఖ్యంగా చేతులు కడుక్కోవడం, ఆరోగ్యకరమైన అలవాట్లను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు కీలక మెలకువలు నేర్పించారు. కరస్పాండెంట్ ఫాదర్ నక్క దేవిద్రాజు, ప్రిన్సిపల్ సిస్టర్ శిబి అంటోనీ, ఉపాధ్యాయులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు శివ ప్రసాద్, మహేష్ , హెల్త్ అసిస్టెంట్లు, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ టీమ్ సభ్యులు ఏకాంత్ నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొని చెత్త నిర్వహణపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. తడి, పొడి, హానికరమైన వ్యర్థాల ఈ–వేస్ట్ (ఎలక్ట్రానిక్) చెత్తను ఇంటి వద్దే వేరు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. ఏ రకమైన వ్యర్థాలను ఏ రంగు డబ్బాలో వేయాలో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించి అవగాహన కల్పించారు.

# రాష్ట్రవ్యాప్తంగా వైద్యులకు నియామక పత్రాలు

# ఎన్‌సీడీ నియంత్రణలో వైద్యుల పాత్ర కీలకం

**: మంత్రి సత్యకుమార్ యాదవ్...**




**నందిగామ మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఎంపికైన వైద్యులకు శుక్రవారం విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యాశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కొత్తగా ఎంపికైన వైద్యులతో పరస్పర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎంపికైన వైద్యులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కొరత లేకుండా నియామకాలు చేపడుతూ ప్రజలకు సమయానికి చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైద్య వృత్తి ఒక గొప్ప సేవా వృత్తి అని, ప్రజల ఆరోగ్యం మరియు ప్రాణాలు వైద్యుల చేతుల్లోనే ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల ప్రతి వైద్యుడు బాధ్యతతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కొత్తగా నియమితులైన వైద్యులు తమ సేవల ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద మరియు మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతి రోగిని సమానంగా చూడడం, సహనంతో వ్యవహరించడం, సమయానికి చికిత్స అందించడం వంటి అంశాలు వైద్య సేవల్లో ముఖ్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రకాశ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకు రావడం, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించడం వంటి చర్యలు చేపడుతు న్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొత్తగా నియమితులైన వైద్యులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆయన కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తారని ప్రకాశ్ రావు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. కొత్తగా నియమితులైన వైద్యులు ప్రజలతో సానుభూతితో వ్యవహరించి, సమయానికి చికిత్స అందించడంలో చురుకుగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నోడల్ అధికారి (ఎన్‌సీడీ) శ్యామల మాట్లాడుతూ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) నియంత్రణ ప్రస్తుతం అత్యంత ముఖ్యమైన అంశమని తెలిపారు. దేశవ్యాప్తంగా మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ఎన్‌సీడీ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని అన్నారు. ఈ వ్యాధులు చాలా వరకు జీవనశైలికి సంబంధించినవని, సరైన ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకర అలవాట్లు పాటించడం ద్వారా వాటిని నివారించవచ్చని చెప్పారు. శ్యామల మాట్లాడుతూ ఎన్‌సీడీ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. మధుమేహం మరియు రక్తపోటు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం కూడా ముఖ్యమని శ్యామల తెలిపారు. సరైన ఆహారపు అలవాట్లు, రోజువారీ వ్యాయామం, పొగ త్రాగడం మరియు మద్యపానం వంటి చెడు అలవాట్లను తగ్గించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. గ్రామ స్థాయి వరకు ఆరోగ్య సేవలను విస్తరించడంలో వైద్యులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. కొత్తగా నియమితులైన వైద్యులు తమ విధుల్లో భాగంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కూడా చురుకుగా ఉండాలని శ్యామల కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సమయానికి పరీక్షలు నిర్వహించి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడంలో వైద్యులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఎన్‌సీడీ కార్యక్రమాల అమలులో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువ కావడానికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు కీలకంగా మారుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎంపికైన వైద్యులు, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన వైద్యులు తమ సేవల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టే విధంగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య రంగ అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన వైద్యులు అంకితభావంతో పనిచేస్తే రాష్ట్ర ఆరోగ్య రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలకు సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

## సమాజ నిర్మాణానికి మహిళది ప్రధాన భూమిక..... కె రామ్ జీ




**మచిలీపట్నం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సూచనల మేరకు మహిళా సాధికారత కార్యక్రమాలను ప్రోత్సహించే ఉద్దేశంతో కృష్ణా విశ్వవిద్యాలయం మహిళా సాధికారత సమన్వయకర్త డా. ఎల్. సుశీల ఆధ్వర్యంలో వాకథాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల్లో మహిళా సాధికారత కార్యక్రమాలను బలోపేతం చేయడానికి విద్యార్థులు, అధ్యాపకులను అంబాసిడర్లుగా నామినేట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ విశ్వవిద్యాలయాలు కళాశాలలకు సూచించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కూన రామజీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సందేశం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల సాధికారతకు అవగాహన అత్యంత అవసరమని, యువత ముందుండి సమానత్వం, గౌరవం కలిగిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.బి. రావు మాట్లాడుతూ వాకథాన్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యతో పాటు సమాజానికి సేవ చేసే భావన ప్రతి విద్యార్థిలో పెంపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. నవీన లావణ్య లత కూడా పాల్గొని మహిళా సాధికారత, సమాన హక్కులు, మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల పురోగతికి యువత చురుకైన పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. మహిళా సాధికారత సమన్వయకర్త డా. ఎల్. సుశీల మాట్లాడుతూ మహిళల హక్కులు, సమాన అవకాశాలు సురక్షిత సమాజ నిర్మాణంపై అవగాహన పెంపొందించడమే ఈ వాకథాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల హక్కుల పరిరక్షణ సాధికారతకు మరింత బలం చేకూర్చే దిశగా ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసి రాయపూడి శైలజ ని ఛైర్‌పర్సన్‌గా నియమించడం ప్రశంసనీయమైన చర్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ మారుతి, అమల, డా. మాధురి, డా. రంగశ్రీ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు,సిబ్బంది మహిళా సాధికారతపై నినాదాలతో వాకథాన్ నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా" ఓపెన్ హౌస్ "



**నరసరావుపేట, మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు, నరసరావుపేట పోలీసు ప్రధాన కార్యాలయం నందు, పల్నాడు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల నందు సిఐ అండ్ ఎస్సై "మహిళా దినోత్సవ వారోత్సవాలను" ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ ల నందు విద్యార్థినులకు "ఓపెన్ హౌస్" నిర్వహణ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు పోలీస్ స్టేషన్‌లోని విభిన్న విభాగాల గురించి తెలిపారు. మహిళా భద్రత, అత్యవసర వ్యవస్థ, డయల్ 100/112, భద్రతా యాప్‌ల ఉపయోగం వంటి అంశాలపై వివరమైన అవగాహన కల్పించారు పోలీసులు తమ విధుల్లో ఉపయోగించే ఆధునిక ఆయుధాలు, తుపాకులు మరియు పిస్టల్స్ గురించి, కమ్యూనికేషన్ పరికరాలు, సెఫ్టీ గాడ్జెట్‌లు, మిషనరీ సామగ్రి గురించి ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెల్ప్‌లైన్ నంబర్లు, స్వీయరక్షణ పద్ధతులపై మెలుకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు పోలీసుల సేవలపై ప్రశ్నలు అడిగి, తమ సందేహాలకు సమాధానాలు పొందారు. మహిళా పోలీసులు సమాజ రక్షణలో పోషించే కీలక పాత్రపై అవగాహన పెంచడంతో పాటు, యువత కూడా భద్రతను కాపాడేందుకు చైతన్యం కలిగి ఉండాలని పోలీస్ అధికారులు సూచించారు. అనంతరం పోలీసు అధికారులు విద్యార్థినులకు నైతిక విలువలు, ధైర్యసాహసాలు, లైంగిక వేధింపులను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చారు లిమార్చి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ తరహా కార్యక్రమాలు మహిళలకు శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని పల్నాడు జిల్లా ఎస్పీ, తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది,హై స్కూల్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ రోజు పోలీసు ప్రధాన కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి అదరపు ఎస్పి . సత్తి రాజు , అదనపు ఎస్పీ (క్రైమ్) లక్ష్మీపతి ,నరసరావు పేట మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుభాషిణి, అడ్మిన్ ఆర్ ఐ వీ.కృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ మార్గంలో వెళ్లాలంటే హడల్..!

**ఆకివీడు మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆకివీడు మండలం ఐ.భీమవరం నుంచి చెరుకుమిల్లి వెళ్లే రహదారి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏలూరుపాడు వంతెన వద్ద రహదారి విస్తరణ కోసం తవ్వకాలు చేపట్టి వదిలేయడంతో, రాళ్లు లేచిపోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారిని సరిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రతి నియోజకవర్గంలో ఘనంగా మహిళ దినోత్సవం వేడుకలు నిర్వహించాలి

### వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలి



**నరసరావుపేట, మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లా కేంద్రంలో ఈ నెల 8 నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పేర్కొన్నారు.శుక్రవారం డి ఆర్ ఓ, ఆర్ డి ఓ లు, మున్సిపల్ కమిషనర్లు డిఆర్డీఏ, మెప్మా,ఐ సి డి ఎస్ పి డి లు వివిధ జిల్లా శాఖల అధికారులతో ఈ నెల 8 న జిల్లా కేంద్రం తో పాటుగా నియోజకవర్గాలలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లు పై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 8 న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించే కార్యక్రమానికి 3 వేల మంది మహిళలు పాల్గొనున్నారని తెలిపారు .జిల్లా కేంద్రం తో పాటుగా నియోజకవర్గాలలో మహిళ దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించాలని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి మినిట్స్ మినిట్స్ తయ్యారు చేయాలని ఐ సి డి ఎస్ పిడిని ఆదేశించారు.మెప్మా, డిఆర్డీఏ,ఐ సి డి ఎస్ పిడీలు మూడు వేల మంది మహిళలను సమకూర్చలని ఆదేశించారు. స్త్రీ శక్తి మహిళ యాప్,మహిళ పోలీస్,డి డిఆర్డీఏ, మెప్మా, స్టాల్స్ ఏర్పాటు చేయాలని,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని డి యం ఀ హెచ్ ఓ ను ఆదేశించారు.డిఆర్డీఏ మెప్మా ద్వారా మెగా చెక్కును పంపిణీ చేయాలని పీడీలను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి లో నిర్వహించే ప్రోగ్రాం లో ముఖ్యమంత్రి పాల్గొనున్న కార్యక్రమం లైవ్ ఉంటుందని తెలిపారు. జిల్లాలోని యం పి,ఎమ్మెల్సీ లు,ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు.మహిళ పారిశ్రామిక వేత్తలను సన్మానించడానికి, వారి విజయ గాథలను వారే వివరించేలా ఏర్పాట్లను చేయాలని డి.ఆర్.డి.ఏ పి.డి కు సూచించారు. అలాగే డి.ఆర్.డి.ఏ, మెప్మా, సంక్షేమ శాఖలు, పరిశ్రమల శాఖ, పోలీస్, శాఖల ద్వారా స్టాల్స్ ను ఈఓటు చేయాలని, ప్రత్యేకంగా మహిళలకు అందించే పథకాలకు సంబంధించిన అసెట్స్ పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి..... జిల్లా కలెక్టరు డీకే బాలాజీ



**మచిలీపట్నం మార్చి 06 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఈనెల 8 వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 8 వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి సమావేశం తో పాటు నియోజకవర్గాల వారీగా ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఆ అధికారి స్థానిక ప్రజాప్రతితులు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో డిఆర్డిఏ ఏపిఎం లు, పోలీసులతో సమన్వయం చేసుకొని సజావుగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు ముఖ్యంగా మహిళ వ్యాపారవేత్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల ప్రదర్శనశాలలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ హెల్ప్ లైన్ 112 టోల్ ఫ్రీ సర్వీసు, గృహహింస, వన్ స్టాప్ సెంటర్, బాల్యవివాహాల నిరోధక చట్టం తదితర అంశాలతో కూడిన ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పోలీస్ శాఖ ముఖ్యంగా శక్తి టీం, మహిళల భద్రత వంటి అంశాలపై ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలన్నారు.ఎస్ సి., ఎస్టి, బీసీ మైనారిటీ సంక్షేమ శాఖల రుణాలకు సంబంధించి ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయాలన్నారు.బాగా వ్యాపారం చేస్తూ మంచి పేరు తెచ్చుకున్న మహిళ వ్యాపారవేత్తలను వేదిక పైకి ఆహ్వానించి వారి విజయ గాథలను వివరించి వారికి ప్రశంసా పత్రం కూడా అందజేయాలన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సత్యనారాయణ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి ఎంఎన్ రాణీ, డి ఆర్ డి ఎ పిడి హరిహరనాథ్ జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, మెప్మా పిడి సాయిబాబు, ఎల్ డి ఎం రవీంద్రారెడ్డి, పలువురు ఎంపీడీవోలు మునిసిపల్ కమిషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com